ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్

సోమవారం అక్టోబరు 7, 2024



రాజగోపురం వద్ద...

మనసంతా అమ్మే..

క్యూలైన్ల రోడ్డులో...



ధన్యోహం





భక్తితో నిన్ను అర్చింతుమమ్మా..



నగరోత్సవం..

దుర్గాఘాట్‌లో కృష్ణమ్మకు హారతి...



మంత్రి ఆనం, సీపీ రాజశేఖరబాబు సమక్షంలో చిన్నారులకు వేదాశీర్వచనం



భక్తులకు పాలు పంపిణీ



అంతరాలయంలో భక్తుల రద్దీ



భళారే.. కేరళ వాద్య సంరంభం



అపూర్వం.. నవదుర్గల నృత్యరూపకం



అలరించిన కళాభినయం





సుందర రూపిణి.. సుమధుర భాషిణి

లలితా త్రిపుర సుందరికి నీరాజనం | **నాలుగో రోజు దుర్గగుడికి భక్తజన వెల్లువ**

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీచక్ర అధిష్ఠానశక్తిగా, పంచదశాక్షరీ మహామంత్రాది దేవతగా.. లక్ష్మీదేవి, సరస్వతీదేవి ఇరువైపులా వింజామరలతో సేవిస్తూ ఉండగా చిరుమందహాసంతో చెరకుగడను చేతపట్టుకుని శివుని వక్షస్థలంపై కూర్చుని కాంతులీనిన లలితా త్రిపుర సుందరీదేవిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. గత మూడు రోజులతో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వేకువన 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల సమయానికే.. అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 55



వేలు దాటిపోయింది. అప్పటికి ఇంకా కొండ దిగువన వినాయక ఆలయం నుంచి పైవరకూ క్యూలైన్లలో భక్తులు కిక్కిరిసి ఉన్నారు.

నేడు శ్రీ మహా చండీదేవిగా..

దుర్గగుడిలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదో రోజు సోమవారం అమ్మవారు శ్రీమహాచండీదేవి రూపంలో దర్శనమివ్వనున్నారు. దర్శన సమయాలు: ఉదయం 4నుంచి రాత్రి 11గంటల వరకు.

సాయంత్రం నుంచి మరింత ఎక్కువ రద్దీ పెరిగింది. ఉత్సవాల నాలుగు రోజుల్లో 2.80 లక్షల మంది వరకూ భక్తులు తరలివచ్చి అమ్మను దర్శించుకున్నారు.

భారీగా పెరిగిన ఆదాయం..

ఆదివారం వేకువన 3 గంటల నుంచే క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తుల భారీ రద్దీతో ప్రసాదాలు, దర్శన టిక్కెట్లు, పూజలు, కేశఖండనశాలపై వచ్చే ఆదాయం పెరిగింది. మొదటి రోజు రూ.28 లక్షలు, రెండో రోజు రూ.47 లక్షలు, మూడో రోజు రూ.54 లక్షల ఆదాయం రాగా.. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం 5 గంటలకే రూ.70 లక్షల ఆదాయం వచ్చింది. మొత్తంగా నాలుగో రోజు సాయంత్రానికి రూ.2 కోట్ల వరకు ఆదాయం ఆలయానికి వచ్చింది. హుండీ కానుకలు, విలువైన నగలు వీటికి అదనం.

ఈనాడు, డిజిటల్ – అమరావతి, న్యూస్‌టుడే – ఇంద్రకీలాద్రి, భవానీపురం, కృష్ణలంక, చిట్టినగర్

పై వంతెనపైనే.. మెట్రో వారధి

- భూసేకరణ భారం లేకుండానే నిర్మాణం
- సుదీర్ఘ పైవంతెన ఆకృతులే కీలకం...
- మెట్రో, ఎన్‌హెచ్‌ఏఐల సమావేశం నేడు

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరానికి మెట్రో ప్రాజెక్టు మళ్లీ తెరమీదకు రావడంతో జాతీయ రహదారుల సంస్థ సమన్వయంతో ప్రాజెక్టు నివేదిక రూపకల్పనకు కసరత్తు జరుగుతోంది. దీనిలో భాగంగా మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు జాతీయ రహదారుల సంస్థ నిర్మించనున్న సుదీర్ఘ పైవంతెన ఆకృతులు కీలకంగా మారనున్నాయి. ఇందుకు భూసేకరణ అవసరం లేకుండా నిర్మించాలనేది ప్రతిపాదన. అదే మార్గంలో మెట్రో ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదన ఉండటంతో ముందే ఒక అవగాహనకు రావాలని నిర్ణయించారు. దీనిపై ఏపీ మెట్రో కార్పొరేషన్ అధికారులు, ఇంజినీర్లు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఇంజినీర్లు, రాష్ట్ర రహదారుల సంస్థ అధికారులు, ఇంజినీర్లు సోమవారం సమన్వయ భేటీ నిర్వహించి.. సుదీర్ఘ పైవంతెన, మెట్రో కారిడార్ నిర్మాణ ఆకృతులపై చర్చించనున్నారు.



మహానాడు జంక్షన్

భూసేకరణ లేకుండానే..!

మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు దాదాపు 6.50 కిలోమీటర్ల సుదీర్ఘ పైవంతెన నిర్మాణం భూసేకరణ భారం లేకుండా చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా విజయవాడకు బైపాస్ నిర్మిస్తున్నారు. కాజా నుంచి చిన్నఅవుటపల్లి వరకు ఆరు వరసల బైపాస్ ఉంటుంది. దీని నిర్మాణం పూర్తయ్యాక గన్నవరం నుంచి కాజా వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారులు భవనాల శాఖకు (జాతీయ రహదారుల విభాగం) అప్పగించనున్నారు. ఇదే ప్రతిపాదన జాతీయ రహదారుల సంస్థ రోడ్లు రవాణా శాఖ ముందుంచగా.. తమకు అప్పగించే ముందు ట్రాఫిక్ రద్దీ మేరకు మార్పులను సూచించింది. ఈమేరకు రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు వద్ద అండర్‌పాస్‌లు లేదా పైవంతెనల నిర్మాణం లేదా సుదీర్ఘ పైవంతెన నిర్మించాలని ప్రతిపాదించారు. విమానాశ్రయానికి వెళ్లే.. వీఐపీ మార్గం కావడంతో అంతరాయం లేని ట్రాఫిక్ నడిచేలా రూపొందించాలని ప్రతిపాదించారు.

మెట్రో కదలికతో..

గత తెదేపా ప్రభుత్వంలో విజయవాడ మెట్రో ప్రాజెక్టు టెండర్ల వరకు వెళ్లింది. తర్వాత ప్రభుత్వం మారడంతో మెట్రో ప్రాజెక్టుకు ఉరేశారు. భూసేకరణనూ గత ప్రభుత్వం ఉపసంహరించింది. తాజాగా కూటమి ప్రభుత్వ రాకతో మెట్రో ఎండీగా ఎన్‌పీ రామకృష్ణారెడ్డిని నియమించారు. విజయవాడలో లైట్ మెట్రోకు మళ్లీ ప్రతిపాదిస్తున్నారు. పీఎన్‌బీఎస్ నుంచి ఒక కారిడార్ ఏలూరు రోడ్డులో, మరో కారిడార్ బందరు రోడ్డులో రానుంది. ప్రస్తుతం సుదీర్ఘ పైవంతెన ఎన్‌హెచ్‌ఏఐ నిర్మించనుంది. మెట్రో లైనుకు ఆటంకం లేకుండా ఆదిలోనే చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు.

ఆరు వరసల పైవంతెనకే మొగ్గు...

రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు నగరంలో కలిశాయి. ఇక్కడ రాష్ట్ర కార్యాలయాలూ వెలిశాయి. విమానాశ్రయమూ ఉండడంతో రాకపోకలు ఎక్కువే. ఈమేరకు మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు 6.5 కిమీ మేర పైవంతెన నిర్మించాలని ప్రతిపాదించారు. అంచనా వ్యయం.. సాధ్యాసాధ్యాలను డీపీఆర్‌లో పొందుపర్చాలి. గత ఆగస్టులోనే డీపీఆర్ టెండర్లను పిలవగా ప్రస్తుతం సవివర ప్రాజెక్టు తయారీలో నిమగ్నమయ్యారు. మహానాడు జంక్షన్ నుంచి రామవరప్పాడు వరకు భూసేకరణకు ఇబ్బంది లేదు. కానీ.. అక్కడి నుంచి నిడమానూరు వరకు కనీసం సర్వీసు రోడ్లు లేక జాతీయ రహదారి కుంచించుకుపోయింది. భవనాలు ఎక్కువగా ఉన్నాయి. భూసేకరణ రూ. కోట్లలో ఉంటుంది. దీంతో భూసేకరణ లేకుండా కనకదుర్గ పైవంతెన తరహాలో ఆరు వరసల పైవంతెన నిర్మించాలనేది ప్రతిపాదన.

ఖర్చు మరింత తగ్గే వీలు..

భూసేకరణ లేకుండా నిర్మించే పైవంతెన మీదనే మెట్రో ప్రాజెక్టు పైవంతెన నిర్మించాలనేది ఓ ప్రతిపాదన. పైవంతెనకు నిర్మించే.. పిల్లర్లను రెండు అంతస్తుల వరకు పొడిగించాలని ప్రతిపాదించారు. వీటిని మరింత ఎత్తు పెంచి నిర్మించే బాధ్యత మెట్రో సంస్థదే. ముందే గట్టి పునాదులు వేయాలని నిర్ణయించారు. ఇది ఎంత సాధ్యమనేది చర్చించనున్నారు. ఈ తరహాలో నిర్మిస్తే.. ఖర్చు బాగా తగ్గి.. భూసేకరణ పని ఉండదని చెబుతున్నారు. సమన్వయ సమావేశంలో అన్ని అంశాలు చర్చిస్తామని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి 'ఈనాడు'తో చెప్పారు.

తిరువూరుకు సమన్వయ కమిటీ..!

- తప్పులను సరిదిద్దుకుంటానని ఎమ్మెల్యే హామీ
- పోటాపోటీగా రెండు సమావేశాలు

ఈనాడు, అమరావతి

"తిరువూరు తెదేపాలో పరిణామాలపై త్వరలో సమన్వయ కమిటీ వేయాలనీ.. ముమ్మందు కమిటీ ఆధ్వర్యంలోనే కీలక నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిరువూరు ముఖ్యనేతలతో భేటీ అయి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. తిరువూరు తెదేపాలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కిన విషయం తెలిసిందే. పార్టీ పరంగా విభేదాల కన్నా.. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీరును విభేదిస్తూ పలువురు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో అధిష్ఠానం రంగంలోకి దిగి సరిదిద్దే ప్రయత్నాలు చేపట్టింది. ముమ్మందు ఎంపీ చిన్ని నేతృత్వంలో ఎమ్మెల్యే కొలికపూడి, నాయకులు సమష్టి నిర్ణయాలు తీసుకోవాలని పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య వివరించారు. వ్యక్తిగత నిర్ణయాలకు తావులేదనీ, సమష్టిగా ముందుకెళ్లాలన్నారు."

ఎమ్మెల్యే కొలికపూడి వ్యాఖ్యలు, ఆయన వైఖరి కొందరికి నచ్చడం లేదు. ఎన్నికల ముందు నుంచి ఇదే వైఖరితో ఓ వర్గం కినుక వహించింది. ఎమ్మెల్యే వ్యాఖ్యలు తమను బాధిస్తున్నట్లు వాపోతున్నారు. సీనియర్ నాయకులు ఇప్పటికే మౌనంగా.. క్రియాశీల రహితంగా ఉంటున్నారు. చిట్యాల సర్పంచి వివాదంతో ఇది రచ్చకెక్కింది. జూదం ఆడుతున్న వారిపై అనుచిత వ్యాఖ్యలు, సర్పంచిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటన, దూషణలకు దిగడం వివాదాలకు దారితీసింది. మరోవైపు.. సర్పంచి భార్య ఆత్మహత్యాయత్నంతో వివాదం దుమారం రేపి అధిష్ఠానం దృష్టిలో పడింది. గతంలోనే ఎమ్మెల్యే వ్యాఖ్యలు, వైఖరిపై చంద్రబాబు క్లాస్ పీకారు. మళ్లీ వివాదం రేగడంతో సీఎం చంద్రబాబు మరింత సీరియస్ అయ్యారు. దీనిపై శనివారం నేతలు మంతెన సత్యనారాయణరాజు, వర్ల రామయ్య, ఎంపీ చిన్ని ఆధ్వర్యంలో వివరణ కోరారు. వారి ముందు హాజరైన ఎమ్మెల్యే కొలికపూడి తన తప్పులను సరిదిద్దుకుంటానని, వైఖరి మార్చుకుంటానని హామీ ఇచ్చారు.

రెండు సమావేశాలు..!

ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం పెట్టి.. సయోధ్య కుదర్చాలని భావించారు. అయితే తిరువూరు నాయకులు, ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం నాయకులు లక్ష్మీపురంలో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ ఆధ్వర్యంలో తిరువూరులో ఏర్పాటు చేశారు. చిట్యాల గ్రామ నాయకులు



ప్రసంగిస్తున్న వర్ల రామయ్య. పక్కన ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు. వేదికపై శ్యావల దేవదత్ తదితరులు

రెండు సమావేశాలకూ రాలేదని తెలిసింది. తిరువూరు మండలాధ్యక్షుడు మినహా, మిగిలిన నాయకులు కార్యకర్తలు సమావేశానికి రాలేదు. ఎంపీ చిన్ని, వర్ల రామయ్య రెండు సమావేశాలకు హాజరయ్యారు. వ్యతిరేక వర్గానికి నచ్చజెప్పి కార్యకర్తల సమావేశానికి రావాలని సూచించారు. చంద్రబాబు మాట జవదాటవద్దని సున్నితంగా మందలించారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే.. అధినేత ఆదేశాలను పెడచెవిన పెట్టినట్లేనని హెచ్చరించారు. పార్టీ తరఫున ప్రతినిధిగా వర్ల రామయ్య వచ్చారనీ.. ఆయన చెప్పినట్లు నడుచుకుందామని సూచించారు. దీంతో కొందరు కార్యకర్తల సమావేశానికి వచ్చారు. అక్కడ ఎమ్మెల్యే కొలికపూడి, సీనియర్ నాయకుడు శ్యావల దేవదత్‌లతో.. ఎంపీ కేశినేని చిన్ని, వర్ల రామయ్యలు సమష్టిగా చేతులు కలిపి ఐక్యత రాగం పలికించారు.

ముఖ్యనేతలతో చర్చ..

తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల ముఖ్యనాయకులు 20 మందితో పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో భేటీకి నిర్ణయించారు. రెండు రోజుల్లో ఈ సమావేశం జరగనుందని ఎంపీ చిన్ని చెప్పారు. నాయకుల ముఖ్య అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని.. సమన్వయ కమిటీ వేయనున్నారు. ఎంపీ చిన్ని నేతృత్వంలో వేసే ఈ కమిటీయే ఇకపై కీలక నిర్ణయాలు తీసుకోనుంది. కమిటీలో ఎవరు ఉండాలనేది 20 మంది కీలక నేతల భేటీలో చర్చించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నిర్ణయించనున్నారు. ఎంపీ కేశినేని చిన్ని 'ఈనాడు'తో మాట్లాడుతూ.. 'తప్పులు ఉంటే సరిదిద్దుకుంటానని ఎమ్మెల్యే చెప్పారు. తన వైఖరి మార్చుకుంటానని భరోసా ఇచ్చారు. ఎవరైనా పార్టీ నిర్ణయం ప్రకారం నడుచుకోవాల్సిందే. ఒక కమిటీ వేసి అభివృద్ధికి నిర్ణయాలు తీసుకుంటాం. కొందరిలో అసంతృప్తి కారణాలు తెలుసుకుని దాన్ని పోగొట్టే ప్రయత్నాలు చేశాం. సమష్టిగా పనిచేసేందుకు సీఎం నిర్ణయానికి కట్టుబడి ఉండేందుకు అంగీకరించారని' వివరించారు.

ధర్మ చక్రానికి కొత్త వన్నె

నిర్లక్ష్యంగా వదిలేసిన గత వైకాపా ప్రభుత్వం



విజయవాడ నగరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, పర్యాటకులను ఆకర్షించేందుకు ఇక్కడి వారధి సమీపంలో 2018వ సంవత్సరంలో రూ.6 కోట్లతో తెదేపా ప్రభుత్వం బౌద్ధ ధర్మచక్రాన్ని ప్రతిష్ఠించారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం చివరి దశలో ఉన్న పనులను పూర్తి చేయకుండా ఈ కట్టడాన్ని నిర్లక్ష్యంగా వదిలేసింది. దీంతో మట్టి పెళ్లలు, పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు నాపరాళ్లు పాడిపోయాయి. కొన్ని రాళ్లు ఊడిపోయాయి. చుట్టూ ఏర్పాటు చేసిన నాలుగు బౌద్ధ విగ్రహాల్లో రెండింటిని దొంగలు ఎత్తుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కట్టడానికి పూర్వ వైభవం తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. దూరమైపోయిన రాళ్ల స్థానంలో కొత్తవి అమర్చుతున్నారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నారు. కొద్దిరోజుల్లో కట్టడం నూతన శోభ సంతరించుకుంటుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - ఈనాడు, అమరావతి



అంచుల్లో ఊడిపోయిన రాళ్లు



దుమ్ము, నల్లని పాచి తొలగిస్తూ..

ఇక పానీయాలు తాగరు.. తినేస్తారు

చల్లగా చెరకురసం, పళ్లరసం తాగాలంటే అందులో ఏ నీళ్లు కలుపుతారో.. ఎక్కడ తయారు చేసిన ఐస్ ముక్కలు వేస్తారో అని ప్రతి ఒక్కరిలో భయం వెంటాడుతుంది. ఇప్పుడు అలాంటి భయం అవసరంలేదు. ఎప్పుడూ జ్యూస్‌లను తాగడమేనా.. దానిని పౌడర్‌లా తింటే ఎలా ఉంటుందో అనుకునే వాళ్లకి చల్లని పరిష్కారం లభించింది. ఈ స్నోమేకర్ యంత్రంలో మీకు కావాల్సినన్ని ఈ యంత్రంలో మంచినీరు బాటిల్‌లో నింపి పెడితే క్షణాల్లో ముద్దలా తెల్లని ఐస్ పౌడర్ తయారవుతుంది. పళ్లరసాలు, చెరకురసం, కొబ్బరినీళ్లు, పాలు ఇలా ఏవైనా ఈ యంత్రంలో వేస్తే వెంటనే పౌడర్‌లా మారిపోతాయి. ఎంతో కొత్తగా ఉన్న ఈ స్నోమేకర్ యంత్రం ధర రూ.45వేల నుంచి రూ.1.5లక్షల వరకు యంత్ర పరిమాణాన్ని బట్టి ఉందని, నూతనంగా వచ్చిన ఈ యంత్రాలకు ఆంధ్రప్రదేశ్‌లో ఆదరణ బాగుందని విజయవాడ ఆటోనగర్‌కు చెందిన కాలిక్కో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ తెలిపారు. విజయవాడ లబ్బీపేటలో ఎస్.ఎస్. కన్వెన్షన్‌లో ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో-2024లో ప్రత్యేక ఆకర్షణగా కనిపించిన దృశ్యమిది. - ఈనాడు, అమరావతి



లోకేశ్ చేయూత... చిన్నారికి భవిత

ప్రాణాపాయస్థితిలో ఆదుకున్న ప్రజాదర్బార్



చికిత్స పొందుతున్న చిన్నారి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదుకు స్పందించి జరిపిన చేయూత ఒక నవజాత శిశువు భవితను ఊపిరిలూదింది. జగ్గయ్యపేటలోని సత్యనారాయణపురానికి చెందిన చదల మహేష్ దంపతులకు గత నెల 14న రెండో కాన్పులో మగ శిశువు కలిగాడు. ఆ చిన్నారికి 14 రోజుల అనంతరం తీవ్ర జ్వరానికి గురై ప్రాణాపాయ స్థితికి చేరుకున్న తరుణంలో మంత్రి లోకేశ్ చూపిన చొరవ ఆ దంపతులకు పెనుభారాన్ని తీర్చింది. గత నెల 25 నుంచి తీవ్రంగా ఏడుస్తూ 27 నాటికి పాలు తాగడం కూడా ఆపేసిన శిశువు అదే రాత్రి జ్వరానికి గురి కావడంతో తొలుత జగ్గయ్యపేట ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అయినా తగ్గకపోవడంతో విజయవాడలోని ఆంధ్రా ఆసుపత్రికి తరలించారు. వైద్యానికి అయ్యే ఖర్చు భరించలేని చిన్నారి తండ్రి మహేష్ మంగళగిరిలో జరిగే ప్రజాదర్బార్‌లో ఆశ్రయించారు. అతడి ఫిర్యాదుపై మంత్రి లోకేశ్ ఓఎస్‌డీకి చెప్పి ఆస్పత్రి ఎండీకి సమాచారం పంపడం ద్వారా పూర్తి ఉచిత వైద్యం అందే అవకాశం కల్పించారు. రూ.లక్షకు ఎల్‌వోసీ కూడా ఇచ్చి ఆసుపత్రికి పంపడంతో ఈ దంపతులకు భరోసా ఏర్పడింది. ఆస్పత్రిలో చేసిన పరీక్షల్లో 90 వేలకు పడిపోయిన ప్లేట్ లెట్స్ వైద్యం అనంతరం సామాన్య స్థితికి వచ్చాయి. వైద్య పరీక్షల్లో చిన్నారికి [illegible] వైరల్ జ్వరంగా నిర్ధారించారు. వైద్యం చేయడంతో చిన్నారి కోలుకుంటున్నాడు. తమ కష్టంలో ఆదుకున్న ప్రభుత్వానికి, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. దంపతులు తమ వాట్సప్ డీపీగా లోకేశ్ ఫొటో పెట్టుకొని తమ కృతజ్ఞతలను చాటుకుంటున్నారు.

8న ఉద్యోగ మేళాలు

మాచవరం, కృష్ణలంక, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ)శిక్షణ కేంద్రంలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధికల్పన అధికారి డి.విక్టర్‌బాబులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి- పీజీ వరకు.. 18 నుంచి 35 సంవత్సరాల్లోపు యువత అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి రూ.40వేల వరకు వేతనం లభిస్తుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 93477 79032 (పాలిటెక్నిక్ కళాశాల), 97000 25833 (ఎన్ఏసీ) ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : రైల్వే స్టేషన్‌కు వెళుతున్న ఓ వృద్ధుడిని.. ద్విచక్రవాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నగర శివారులోని తాడిగడపకు చెందిన లింగాచారి (60).. రైల్వేస్టేషన్ వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఆదివారం తెల్లవారుజామున బయలుదేరారు. మహాత్మా గాంధీ రోడ్డులో ఠాగూర్ గ్రంథాలయం వద్ద మలుపు తిరుగుతుండగా.. బస్టేషన్ వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ముగ్గురు యువకులు ఆయన్ని ఢీ కొట్టారు. నేలపై పడి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. ఉదయం 8 గంటల సమయంలో మృతి చెందారు. దీనిపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో మంటలు

భవానీపురం, న్యూస్‌టుడే : భవానీపురంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఆదివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో పలు దస్త్రాలు ఫర్నీచర్, ఏసీలు దగ్ధమయ్యాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇచ్చారు. కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ప్రమాదం కారణంగా ఎంత మేర నష్టం వాటిల్లిందనే విషయమై అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎత్తిపోతల.. నిధులిస్తే జలకళ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

- ముక్త్యాల పథకంపై అన్నదాతల ఆశ
- మరుగున పడేసిన గత ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ముక్త్యాల ఎత్తిపోతల పథకంపై అన్నదాతలు ఆశలు పెట్టుకుంటున్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దీనికి శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించేలోగా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పథకం స్థలం, పేరు మార్చి మళ్లీ శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారు సంస్థ పనులు నిలిపేసి యంత్ర సామగ్రితో సహ వెళ్లిపోయింది. దానిని పట్టాలెక్కించి సాగు, తాగునీటి ఇబ్బందులు తీర్చాలని అన్నదాతలు కోరుతున్నారు.

పేరు మార్చి... రైతులను ఏమార్చి

వాస్తవానికి పాత పాలకుల ముద్ర తొలగించడమే ధ్యేయంగా వైకాపా ప్రభుత్వ పాలన సాగింది. అందుకు ముక్త్యాల పథకమే మచ్చుతునక. 2019 ఫిబ్రవరి 16న అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన పథకం పేరును వేదాద్రి ఎత్తిపోతలగా మార్పు చేసింది. స్థలం కూడా మార్చేసింది. రైతుల్లో ఆశలు రేకెత్తించింది. 2020 ఆగస్టు 28న అప్పటి సీఎం జగన్‌తో శంకుస్థాపన చేయించారు. స్థానిక నాయకులు సంబరాలు చేసుకున్నారు. కనీసం ప్రాథమిక పనులు కూడా పూర్తి చేయకుండానే వదిలేశారు.

★ ముక్త్యాల ఎత్తిపోతలకు గతంలో తెదేపా ప్రభుత్వం రూ.489.28 కోట్ల అంచనాలు రూపొందించింది. వేదాద్రి ఎత్తిపోతలకు కూడా దాదాపు అదే అంచనాలతో ప్రతిపాదించారు. వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో నిధుల విడుదల ఆగిపోయింది. గుత్తేదారు సంస్థ పనులు ప్రారంభించి మూడు నెలలు తిరక్కుండానే సామగ్రితో సహా సర్దుకొని వెళ్లిపోయింది.

36 వేల ఎకరాలకు..

జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 32 గ్రామాలు, 29 వేల మంది రైతులకు సంబంధించిన 36 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీటి సరఫరాకు [illegible] రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏటా సరిగా నీరందని ఎన్ఎస్‌పీ ఆయకట్టు రైతులకు ఆ కాల్వల ద్వారానే కృష్ణా నీటిని ఎత్తిపోయడం పథకం ఉద్దేశం. ఇది కార్యరూపం దాల్చితే సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది.



కొన్నేళ్లుగా శిలాఫలకానికే పరిమితమైన పనులు

తప్పక పూర్తి చేస్తాం

గతంలో మా ప్రభుత్వ హయాంలో రూపొందించిన పథకాన్ని నాతో పాటు ఎంపీ శివనాథ్ కూడా ఎంతో పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే మంత్రిని కలిసి పథకం ఆవశ్యకతను వివరించాం. నిధుల లభ్యతకు అనుగుణంగా వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ప్రభుత్వం నుంచి హామీ లభించింది. పథకాన్ని సాకారం చేస్తాం.

– శ్రీరాం తాతయ్య, ఎమ్మెల్యే, జగ్గయ్యపేట

పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం



స్టాల్స్ ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర వహించే పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, అందుకు అనుగుణంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఆదివారం లబ్బీపేటలోని ఎస్.ఎస్.కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన మెగా ఫుడ్ బిజినెస్-2024ను ఆయన సందర్శించారు. ఎంపీ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలను ప్రజలకు తెలియజేసేందుకు రాష్ట్రంలో మరిన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, కేటరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వరదరాజులు, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు, విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గడ్డం రవి, యు.రేణుకాదేవి, పి.ఎస్.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న కనక దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలలో అన్ని శాఖలకు చెందిన అధికారులు విధుల్లో ఉన్నందున సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అగ్ని ప్రమాదంలో కార్ల దగ్ధం

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: బెంజిసర్కిల్‌లోని జ్యోతి కన్వెన్షన్ సమీపంలో బిస్మిల్లా కేజీఎన్ మోటార్స్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు కార్లు దగ్ధమయ్యాయి. సెలవు కావడం వల్ల మూసి ఉండగా గమనించిన స్థానికులు యజమాని ఎస్‌కే రహీంబాషాకు సమాచారం అందించారు. మంటలను నియంత్రించేవారు లేకపోవడంతో ఒక్కసారిగా ఎగిశాయి. అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి కె.వినయ్ నేతృత్వంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అదుపు చేశారు. ఒక కారులో ఉన్న బాటరీ షార్ట్‌సర్క్యూట్ అవడం వల్ల ఈ ప్రమాం జరిగిందని సిబ్బంది చెబుతున్నారు. దీంతోపాటు ఎదురుగా ఉన్న మరో కారులోకి మంటల వ్యాపించగా అందులో ఇంజిన్లు, ఇతర భాగాలు పూర్తిగా కాలిపోయాయి. మరో కారు పాక్షికంగా దగ్ధమయ్యింది. రూ.9లక్షలకు పైగా నష్టం జరిగి ఉంటుందని సిబ్బంది తెలిపారు. రెండు కార్లకు మరమ్మతులు చేయడం పూర్తయ్యిందని ఆదివారం సెలవు కావడం వల్ల సర్వీసింగ్ చేసి సోమవారం యజమానులకు అప్పగించుదామని అనుకున్న తరుణంలో అగ్నిప్రమాదం జరిగిందని షెడ్డు యజమాని రహీంబాషా ఆవేదన వ్యక్తం చేశారు.



మంటలను నియంత్రిస్తున్న అగ్నిమాపక సిబ్బంది





కాలిపోయిన వాహనాలు

దరఖాస్తుల స్వీకరణకు ఆలస్య రుసుము చెల్లించక్కర్లేదు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: పీజీ వైద్య విద్యలో ప్రవేశాల కోసం... ఆలస్య రుసుముతో కాకుండా.. సాధారణ విధానంలోనే సోమవారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వెల్లడించింది. రూ.10 వేల ఫీజుతో ఆలస్యంగా దరఖాస్తులు స్వీకరించడంపై మీడియాలో వచ్చిన వార్తలపై విశ్వవిద్యాలయం ఆదివారం స్పందించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆలస్య ఫీజుతో 16 మంది మాత్రమే దరఖాస్తు చేశారని తెలిపింది. వీటినీ సాధారణ విధానంలో దరఖాస్తు చేసినట్లు గుర్తిస్తామని వెల్లడించింది. సకాలంలో మెరిట్ లిస్టు తయారీకి మాత్రమే ఆలస్య రుసుము విధానాన్ని అమల్లోనికి తెచ్చామని పేర్కొంది. జాతీయ స్థాయిలో ఎన్ఎంసీ ప్రకటించే షెడ్యూలుకు అనుగుణంగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపింది. గతంలో మాదిరిగానే కౌన్సెలింగ్ ప్రారంభానికి ముందు సీట్ మ్యాట్రిక్స్‌ను ప్రకటించి, వైద్య విద్యార్థుల నుంచి ఆప్షన్లు కోరుతామని వెల్లడించింది.

ఇంటర్ డూప్లికేట్ పత్రాలకు దరఖాస్తులు

మాచవరం, న్యూస్‌టుడే : జిల్లాలో ఇటీవల వరదలకు ఇంటర్ ధ్రువీకరణ పత్రాలు తడిచిచ పాడైపోయిన అభ్యర్థులు.. నకళ్ల(డూప్లికేట్)కు ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి సీఎస్ఎస్ఎన్ రెడ్డి తెలిపారు. దరఖాస్తుదారుని చిరునామాతో సొంత డిక్లరేషన్, ఆధార్‌కార్డు నకలు, కావాల్సిన ధ్రువీకరణ పత్రాల నకలు (ఉంటే) దరఖాస్తుకు జతచేసి సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ ద్వారా సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టవర్ల నిర్మాణం అడ్డుకున్న రైతులు: నున్న బైపాస్‌లో ఉద్రిక్తత



కాంట్రాక్టర్‌తో గొడవ పడుతున్న రైతులు, కుటుంబ సభ్యులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : పశ్చిమ బైపాస్ విస్తరణలో భాగంగా నున్న బైపాస్ సమీపంలో హైటెన్షన్ టవర్లు వేస్తుండగా రైతులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఎలాంటి సమాచారం లేకుండా.. నోటీసులు ఇవ్వకుండా తమ పొలాల్లో టవర్లు ఎలా వేస్తారని ఆదివారం గుత్తేదారుడిని నిలదీశారు. కోర్టు నిబంధనల ప్రకారం.. ఏదైనా ప్రైవేటు భూములు, స్థలాల్లో నిర్మాణాలు చేపడితే సంబంధిత యజమానులకు ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. కానీ గుత్తేదారు పట్టించుకోకుండా ఇష్టానుసారం తమ పొలాల్లో టవర్లు ఏర్పాటు చేస్తున్నారని రైతులు, కుటుంబ సభ్యులు మండిపడ్డారు. పెద్ద ఎత్తున గొవడ జరగడంతో పోలీసులు చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. కలెక్టర్ అనుమతి లేకుండా, తమకు నష్టపరిహారం చెల్లించకుండా ఏ విధంగా తమ పొలాల్లో టవర్లు నిర్మిస్తారని ధ్వజమెత్తారు. సోమవారం గాంధీనగర్‌లో తహసీల్దార్‌ను కలుస్తామని చెప్పారు. అవసరమైతే ధర్నాకు దిగతామని రైతులు హెచ్చరించారు. ఆన్‌లైన్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు వివరించారు.

అక్రమంగా తరలిస్తున్న 50 గోవుల స్వాధీనం



నెమలి వేణుగోపాలస్వామి ఆలయ కోనేరు వద్ద సేద తీరుతున్న ఆవులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం లోని హనుమాన్‌జంక్షన్ నుంచి హైదరాబాదుకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 50 గోవులను ఎన్టీఆర్‌జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం పోలీసులు శనివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్.శ్రీను తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెనుగొలను వద్ద అర్ధరాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా లారీలో ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే లారీని స్వాధీనం చేసుకొని ఆవులను నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలోని గోశాలలో ఉంచామని పేర్కొన్నారు. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం నర్సింగ్ తండాకు చెందిన డ్రైవర్ బాణావత్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏకలవ్య ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ నూతన కమిటీని ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కండెల ఆంజనేయరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేడ రమేష్, ఉపాధ్యక్షుడిగా మొగలి అద్దయ్య, ప్రధాన కార్యదర్శిగా జగన్నాథ బాబూరావు, సహాయ కార్యదర్శిగా దేవర వెంకటేశ్వర్లు, కోశాధికారిగా భారతి ఎన్నికయ్యారు. అలాగే కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా కె.నాగవెంకన్న, గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా కుంభ ఏడుకొండలు నియమితులయ్యారు.

8న జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు: నూజివీడులోని డీఏఆర్ కళాశాల మైదానంలో ఈ నెల 8వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. జనవరి ఒకటి, 2011 తర్వాత జన్మించినవారై జిల్లా బాస్కెట్‌బాల్ సంఘానికి అనుబంధంగా ఉన్న క్లబ్బులకు చెందిన క్రీడాకారులు మాత్రమే ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆధార్ కార్డు, పుట్టినతేదీ ఒరిజనల్ ధ్రువపత్రాలతో ఎంపిక పోటీలకు హాజరవ్వాలన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10 నుంచి మూడు రోజుల పాటు తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో జరిగే 7వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు.

ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ జట్లు...

విజయవాడ క్రీడలు: జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య(ఎస్‌జీఎఫ్) స్కేటింగ్ జట్ల ఎంపికలు ఈ నెల 8, 9వ తేదీల్లో భవానీపురం హెచ్‌బీ కాలనీలో నిర్వహిస్తామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కృష్ణా జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డి.శ్రీనివాసరావు సంయుక్తంగా తెలిపారు. 8వ తేదీన స్కేటింగ్ రింక్, 9వ తేదీన రోడ్ రేస్ అండర్-11, 14, 17 కేటగిరీల్లో బాలబాలికల విభాగాల్లో జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఆయా తేదీల్లో ఉదయం 6 నుంచి 8 గంటల్లోపు తగు ధ్రువీకరణ పత్రాలతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 70134 19902 నంబరుపై సంప్రదించాలన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

క్వాలిఫైయింగ్ ఫైనల్ రౌండ్‌కు షట్లర్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని సీహెచ్‌ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియం, ఎస్ఎస్‌బీఏ ఇండోర్ స్టేడియాల్లో జరుగుతున్న ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో పలువురు రాష్ట్ర షట్లర్లు క్వాలి ఫైయింగ్ ఫైనల్ రౌండ్‌లో ప్రవేశించారు. ఆదివారం జరిగిన పోటీల్లో పలువురు రాష్ట్ర షట్లర్లు హోరా.. హోరీగా తలపడి తమ సత్తా నిరూపించారు. అండర్-15 బాలుర సింగిల్స్‌లో ఎ.పవన్ అంగడ్ రాజ్, ఎస్.హేమంత్‌శ్రీ, వినాయక మణిబాబు, ఎం.కృష్ణ కార్తీక్, సీహెచ్ విజయ్ చరణ్, కె.మోక్షజ్ఞ సాయి, బాలికల సింగిల్స్‌లో ఐ.తన్వి, ఆర్.లక్ష్మీసాయి ఆరాధ్య, డి.వెంకటేష్ యజ్ఞశ్రీ, డి.ధన్య సంజన, ఎస్.మనస్వి, అండర్-17 బాలుర సింగిల్స్‌లో డి.శేఖర్‌శతమన్యు(కృష్ణా), హరికృష్ణ వీరంరెడ్డి, బాలికల సింగిల్స్‌లో ఆర్.లక్ష్మీసాయి ఆరాధ్య(గుంటూరు), ఆర్.స్ఫూర్తిలు ఫైనల్ రౌండ్‌లో ప్రవేశించారు. సోమవారం క్వాలి ఫైయింగ్ ఫైనల్ రౌండ్ పోటీలు జరుగుతాయని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పోలినేని అంకమ్మచౌదరి తెలిపారు.



శేఖర్ శతమన్యు



లక్ష్మీసాయి ఆరాధ్య

తిరువూరు

• తిరువూరు • మైలవరం

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ


కొత్తరెడ్డిగూడెంలో ఉయ్యూరు బోసురెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, నాయకులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలో పలువుర్ని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఆదివారం పరామర్శించారు. కొత్తరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఉయ్యూరు బోసురెడ్డి కుమారుడు అంజిరెడ్డి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కూనపరాజుపర్వ గ్రామానికి చెందిన మడిమల సుబ్బారావు ఇటీవల మృతిచెందారు. ఎమ్మెల్యే వారి ఇంటికెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన బూత్ కన్వీనర్ మేరుగు రవి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో అతడిని పరామర్శించారు. రెడ్డిగూడెం పంచాయతీ రాఘవాపురం గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు ఉయ్యూరు రత్తా రెడ్డి ఇటీవల గాయపడగా ఎమ్మెల్యే బాధితుడి నివాసానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

మైలవరం, న్యూస్‌టుడే: నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు దసరా కానుకగా డీఏ, ఐఆర్(మధ్యంతర భృతి) ప్రకటించాలని మైలవరం మండలశాఖ పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు పి.గోపాల్, ఎం వెంకటేష్ కోరారు. మైలవరంలో ఆదివారం నిర్వహించిన పీఆర్టీయూ మండల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ పాత పీఆర్సీలోని డీఏ బకాయిలు సర్వీసు రిజిస్టార్ నమోదు చేయాలని తీర్మానించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తరగతికి ఒక ఉపాధ్యాయుడి పద్ధతి చాలా ఉపయోగకరంగా ఉంటుందనే తీర్మానాన్ని సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ..రాష్ట్ర కార్యదర్శి పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు శేషగిరిరావు, సతీష్, సూరిబాబు, గోపాలం తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు

గొల్లపూడి: ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పేర్కొన్నారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఓబులేసు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.10వేలు ఇస్తూ వారి చేత అధిక చాకిరి చేయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేస్తున్న ఆశా కార్యకర్తలకు వేతనాలు మాత్రం పెంచడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, వారాంతపు సెలవులు, మెటర్నిటీ సెలవులు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్, మరణించిన కార్యకర్తల కుటుంబాలకు రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. నాయకులు వెంకటసుబ్బయ్య, మరియమ్మ, చాముండీ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి. అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

కంటి వైద్య పరీక్షలు

రెడ్డిగూడెం: రుద్రవరం పంచాయతీ పరిధిలోని శ్రీయస్ పాలెం సీఎస్ఐ చర్చి దగ్గరలో అభ్యుదయ యువశక్తి సంఘం, విస్సన్నపేట సిరి ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి వైద్య సేవలు అందజేసినట్లు యువశక్తి సంఘం అధ్యక్షుడు సిహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. పిల్లమేరి వైద్యసేవలు అందజేశారు. పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులు

ప్రారంభం కాని మినీ లెదర్ పార్కు నిర్మాణం

కూటమి ప్రభుత్వంపై చర్మకారుల ఆశలు

జి.కొండూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ చర్మకారులను చిన్న చూపు చూసినందంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఆ కాలం ఉన్న లెదర్ పార్కు నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో పలువురు కార్మికులు ఇప్పటికీ అవస్థలు పడుతున్నారు. రాష్ట్రంలో రెండు మినీ లెదర్ పార్కు నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం కాగా..అందులో ఒకటి ప్రకాశం జిల్లా యద్దనపూడి, రెండోది ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెల్లటూరులో నిర్మించ తలపెట్టారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రధాన మంత్రి అజయ్ పథకం కింద రూ.11.5 కోట్లు లెదర్ పార్కు, యూనిట్ నిర్మాణానికి, చర్మకారులకు శిక్షణ నిమిత్తం కోటి రూపాయలు మంజూరు చేసింది. 2023 మార్చి 17 తేదీన నిధులను మంజూరు చేసి ఏపీ షెడ్యూల్ కార్పొరేషన్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు నిర్మాణం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిధులను రాష్ట్ర చర్మ పరిశ్రమాభివృద్ధి సంస్థ(లిడ్ కాప్)కు బదలాయించగా యూనిట్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వెల్లటూరులో మినీ లెదర్ పార్కు ఏర్పాటుకు రూ.5.75 కోట్లు నిధులు, స్థలమున్నా నిర్మాణం చేపట్టకపోవడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న చర్మకారులు ఆవేదన చెందుతున్నారు. నిర్మాణం విషయమై ఎన్నోసార్లు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మినీ లెదర్ పార్కు యూనిట్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


అడవిని తలపిస్తున్న పార్కు నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశం

స్థలం కేటాయింపు వివరాలిలా..

2003 లోనే తెదేపా హయాంలో 7 ఎకరాల స్థలాన్ని వెల్లటూరులో కేటాయించారు. నిధులు మంజూరు చేసేలోపు ఆ ఏడెకరాల్లో 6 ఎకరాలు మూడేళ్ళ కిందట జగనన్న కాలనీకి కేటాయించడంతో ఇప్పుడు ఎకరం స్థలం మాత్రమే మిగిలిపోయింది. ఇప్పుడది పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తోంది. మిగిలిన ఎకరం స్థలం కూడా ఆక్రమణ గురి కాక ముందే మినీ లెదర్ పార్కు నిర్మాణం యూనిట్ చేపట్టాలని పేద చర్మకారులు ఆశిస్తున్నారు.

పేదలకు మేలు : బట్టపర్తి రాజు, జిల్లా చర్మకారులు సంఘం కార్యదర్శి



నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, లిడ్‌కాప్ అధికారులు స్పందించి త్వరితగతిన మినీ లెదర్ పార్కు నిర్మాణం చేపడితే జిల్లాలో కొన్ని వేల పేద చర్మకారుల కుటుంబాలకు జీవనోపాధి కలుగుతోంది.

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు



కొండపల్లి, న్యూస్‌టుడే: ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను పురపాలిక పరిధిలోని కొండపల్లిలో ఏపీఎస్పీడీసీఎల్ సిబ్బంది ఆదివారం ఏర్పాటు చేశారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు, వీధి దీపాలకు వాటిని ఏర్పాటు చేసినట్లు సహాయక ఇంజినీర్ సుబ్బారావు తెలిపారు. కొండపల్లి పరిధిలో మొత్తం 71 మీటర్లు పెట్టినట్లు పేర్కొన్నారు.

అధికారుల ఇంటింటి సర్వే

మైలవరం, న్యూస్‌టుడే: గత తెదేపా ప్రభుత్వం హయాంలో చేపట్టిన ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా నిర్మించిన గృహాలకు బిల్లులు పెండింగ్ ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాలతో అధికారులు వెల్వడం గ్రామంలో ఇంటింటి సర్వే చేపడుతున్నారని దానిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కూటమి నాయకులు సూచించారు.

మత విద్వేషాలు సృష్టించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి కృష్ణ

తిరువూరు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించకుండా సనాతన ధర్మం పేరుతో ప్రజల మధ్య మత విద్వేషాలు సృష్టిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ ఆరోపించారు. ఎన్టీఆర్ జిల్లా 25వ సీపీఎం మహాసభలను ఈ ఏడాది డిసెంబరులో తిరువూరులో నిర్వహించేందుకు ఆదివారం ఏర్పాటు చేసిన ఆహ్వాన సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉద్యమాలు, పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ..గంపలగూడెం మండలం వినగడప సమీప కట్లేరుపై వంతెన వెంటనే నిర్మించాలని, ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధి సమస్యను పరిష్కరించాలని, తిరువూరులో డ్రెయినేజీ రహదారులు, కోతులు, తాగునీరు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడిగా ఎస్.నాగేశ్వరరెడ్డి, అధ్యక్షుడిగా జి.వెంకటరత్నం, కార్యదర్శిగా ఎం. నాగేంద్రప్రసాద్, కోశాధికారిగా బి.వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

చింతలనర్వ (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని చింతలనర్వలో ఇటీవల జ్వరంతో మృతి చెందిన బుక్‌కీపర్ సుజాత కుటుంబానికి ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఆదివారం రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. తన కార్యాలయంలో ఆ సొమ్మును ఆమె కుమారుడికి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఏ ఇబ్బంది ఉన్నా అండగా ఉంటా అని ఆయన వారికి హామీ ఇచ్చారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షాన సీపీఐ పోరాటం


నిర్మాణంలో ఉన్న చిహ్నం వద్ద సీపీఐ నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని పోరాటనగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పోరాట చిహ్నాన్ని పార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ. .భూ పోరాట ఉద్యమాల ఫలితంగా వేలాది మంది నిరుపేదలకు వేల ఎకరాల భూములను సీపీఐ ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పేదల పక్షాన సీపీఐ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేస్తామని తెలిపారు.

మధిర శాఖ కాల్వకు 994 క్యూసెక్కుల సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మధిర బ్రాంచి కెనాల్‌కు ఆదివారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 994 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదల చేసినట్లు ఎన్నెస్పీ ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 332 క్యూసెక్కులు చేరాయి. దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు 50, పెదకొమిర 30, మధిర 55, నిదానపురం 70 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నారు.

ఆలపాటి విజయానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న తెదేపా నాయకుడు సీతారామయ్య

కొండపల్లి, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నియోజకవర్గానికి తెదేపా తరఫున పోటీలో ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి కూటమి నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీతారామయ్య కోరారు. కొండపల్లి తెదేపా కార్యాలయంలో కూటమి నేతల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు ఓటును కొత్తగా నమోదు చేసుకోవాలన్నారు. అటువంటి వారందరిని గుర్తించి ఓటు నమోదు ప్రక్రియను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సీహెచ్ చిట్టిబాబు, సీహెచ్ శ్రీను, వెంకయ్యనాయుడు, నాయకులు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.


జి.కొండూరు బీసీ కాలనీలో లలితా త్రిపుర సుందరీదేవి


తిరువూరు పోలీస్‌స్టేషన్‌లో..


గంపలగూడెం బస్టాప్ సెంటర్‌లో..


తిరువూరు వాముకుంట్లలో


గంపలగూడెం మెట్టగుట్టలో..


గంపలగూడెం ఊటుకూరులో..


ఎ.కొండూరు చీమలపాడులో..


ఎ.కొండూరు కంభంపాడులో..


గంపలగూడెం పెనుగొలను శివాలయంలో..


కూనపరాజుపర్వలో..


ఎన్టీటీపీఎస్ అభయసాయి మందిరంలో..


విస్సన్నపేట: హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొలికపూడి దంపతులు


గంపలగూడెం: ఆర్లపాడులో పూజల్లో పాల్గొన్న మహిళలు

అఖిలాండేశ్వరీ పాహిమాం

తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజైన ఆదివారం జగన్మాత ప్రతిమలను లలితా త్రిపుర సందరీదేవిగా అలంకరించారు. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుంకుమ పూజల్లో అధిక సంఖ్యల్లో మహిళలు పాల్గొన్నారు. నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. పలుచోట్ల బతుకమ్మ పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే బృందం


గంపలగూడెంలో బతుకమ్మ వద్ద మహిళల కోలాటం


ఇబ్రహీంపట్నం గ్రామీణం : కాచవరం అయ్యందొర కాలనీలో..


కొండపల్లి బొద్దురాయి కూడలిలో లలితా త్రిపుర సుందరీదేవిగా

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌లో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన స్కూల్ గేమ్స్ సమాఖ్య(ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి అండర్-19 సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా బాలికల జట్టు రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో ఆతిథ్య పశ్చిమ గోదావరి జట్టుతో తలపడి 0-1 పరుగు తేడాతో ఓటమిపాలైందని జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వేమూరి రవికాంత తెలిపారు. జిల్లా బాలుర జట్టు చతుర్థ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ ఛాంపియన్‌షిప్ నుంచి బాలికల విభాగంలో కె.సంధ్య, టి.దివ్య, కె.స్మైలీ, బాలుర విభాగంలో డి.కృష్ణలు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరంతో డిసెంబరులో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తలపడే రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ట్రోఫీ సాధించిన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, పలువురు పీడీలు అభినందించారు.


అతిథుల నుంచి రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలికల జట్టు సారథి, జట్టు సభ్యులు, కోచ్, మేనేజర్లు

రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ అండర్-17 బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. గత అయిదు రోజులు జరిగిన శిక్షణ శిబిరంలో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు పాల్గొన్నారని ఎన్టీఆర్, కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు సంయుక్తంగా తెలిపారు. జట్టు సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి.

జట్టు: పి.పెదబాబు, జి.రాము, డి.వెంకట రమణ, సయ్యద్ సాబాద్, షేక్ అబ్దుల్ రఫీక్, జె.తారకేష్, ఎల్.జశ్వంత్(కేబీసీ జడ్పీహెచ్ స్కూల్, పటమట), ఎం.సుమంత్, వి.సిద్ధు, బి.అభినవ్, ఎం.నవీన్‌కుమార్, డి.హర్షవర్ధన్ (జడ్పీహెచ్ స్కూల్, కొండపల్లి), ఎం.అభిషేక్, కె.అభిలాష్(సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కృష్ణారావుపాలెం), ఎండీ తన్విత్ (నిర్మల హై స్కూల్, పటమట). ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా ఎల్.దుర్గారావు (ఎస్ఏ పీఈ, కేబీసీ జడ్పీహెచ్ స్కూల్, పటమట) వ్యవహరిస్తారు.


ఎంపికైన జిల్లా జట్టు సభ్యులతో కోచ్ దుర్గారావు

పిడుగుపాటుకు తాటి చెట్టు దగ్ధం



ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరులో ఆదివారం సాయంత్రం పిడుగు పడి తాటి చెట్టు దగ్ధమైంది. 6 గంటల సమయంలో చినుకు లేకుండా ఒక్కసారి ఉరుములు, మెరుపులతో భారీ శబ్దాలు గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేశాయి. అదే సమయంలో ఊరి చివర ఉన్న తాటి చెట్టుపై పిడుగు పడటంతో మంటల చెలరేగాయని స్థానికులు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఇరువురి బలవన్మరణం

కొండపల్లి, న్యూస్‌టుడే: కుటుంబ వ్యవహారాల్లో నెలకొన్న సమస్యలకు తాళలేక ఇరువురు బలవన్మరణం చెందిన సంఘటనలు కొండపల్లిలో వేర్వేరు చోట్ల ఆదివారం చోటుచేసుకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శాలివాహన బజార్‌లో నివసించే అశోక్(35) ఓ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతడికి కంచికచర్లకు చెందిన రమణతో ఆరేళ్ల కిందట వివాహమవగా..ఓ పాప సంతానం. కొంత కాలంగా భార్య భర్తల మధ్య వివాదాలు నెలకొని ఎవరికి వారు పుట్టిళ్లలో ఉంటున్నారు. ఆదివారం ఉదయం అశోక్ తన తల్లిదండ్రులతో భార్య, పాప గురించి మాట్లాడాడు. కొంత సేపటికి గదిలోకి వెళ్లిపోయాడు. నిద్రపోతున్నాడనుకున్న తలిదండ్రులు మధ్యాహ్నానికి చూసే సరికి ఉరివేసుకొని కనిపించడంతో బోరుమన్నారు. ఇదిలా ఉంటే మరో సంఘటనలో యాదవుల బజార్‌లో నివాసముండే ఈశ్వరి(30)కి ఏడాది కిందట విజయవాడకు చెందిన యువకుడితో వివాహమైంది. కొన్ని నెలలుగా భార్యభర్తల మధ్య వివాదం నెలకొనగా ప్రస్తుతం పుట్టింట్లోనే ఉంటోంది. ఆదివారం ఉదయం తలిదండ్రులు ఓ శుభకార్యానికి వెళ్లగా ఒంటరిగా ఉన్న ఈశ్వరి కొంతసేపటికి వాళ్లకు ఫోన్ చేసి వస్తున్నారా అని అడిగింది. సాయంత్రం వారు ఇంటికి వచ్చే సమయానికి ఇంట్లో ఉరివేసుకొని ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దాములూరు గ్రామంలో వివాహిత వేధిస్తున్న వ్యక్తిపై ఇబ్రహీంపట్నం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు సైకం గణపతి తన ఇంటి సమీపంలో నివసిస్తున్న వివాహితను ఇబ్బంది పెడుతూ అసభ్య పదజాలంతో మాట్లాడుతూ వేధిస్తున్నాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరిస్తున్నాడు. సహనం కోల్పోయిన ఆమె తన భర్తకు ఈ విషయాన్ని వివరించి ఇద్దరు కలిసి ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

అనుమానాస్పద మృతిపై..

రాయనపాడు(ఇబ్రహీంపట్నం), న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయనపాడులో వ్యక్తి ఉరేసుకుని మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..గ్రామానికి చెందిన మందా చంద్రబాబు(50) రోజు వారీ పనులు చేసుకొని జీవిస్తుంటాడు. గత కొన్ని రోజుల నుంచి గ్రామంలో ఇతని కుటుంబానికి మరి కొందరికి వివాదం జరుగుతోంది. ఈ క్రమంలోనే మనస్థాపానికి గురై ఇంట్లో ఉరేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జ్వరంతో కౌన్సిలర్ మృతి

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి ఏడో డివిజన్ కౌన్సిలర్ కుమ్మరి నాగసుధా ఆదివారం మృతి చెందారు. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఈమె స్థానికంగా చికిత్స పొందుతున్నారు. ఆదివారం పరిస్థితి విషమించడంతో విజయవాడకు తరలించే క్రమంలో మృతి చెందారు. డెంగ్యూ లక్షణాలతో ఆమె మృతి చెందారని బంధువులు ఆరోపించారు. జ్వరాల నియంత్రణ పట్ల పురపాలిక, వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్లాలని తెదేపా కౌన్సిలర్లు పేర్కొంటున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ


పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన పరిటాల శివారు వద్ద ఆదివారం జరిగింది. ఎస్సై బోనగిరి రాజు తెలిపిన వివరాల మేరకు.. వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన కొమెర వెంకటేశ్వర్లు ట్రిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం విధులు ముగిసిన అనంతరం ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపట్నం నుంచి కంచికచర్ల వైపు వస్తుండగా, పరిటాల శివారు వద్ద కంచికచర్ల నుంచి విజయవాడ వైపు వెళుతున్న కంటైనర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు కుడి కాలు విరగడంతో పాటు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విజయవాడ తూర్పు

చూసిన కనులదే భాగ్యం



దత్తపీఠంలో శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా..



మహిళల పూజలు

పటమట, న్యూస్‌టుడే: పటమట దత్త పీఠంలోని శ్రీమరకత రాజరాజేశ్వరీ ఆలయంలో ఆదివారం అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి క్షీరాభిషేకం చేసి బంగారు చీరతో అలంకరించి పంచహారతులు ఇచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కుంకుమ పూజ, ఖడ్గమాల అరుణహోమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జగన్మాతకు భక్తితో పూజలు





మహాలక్ష్మీదేవి అలంకారం.., కుంకుమ పూజలో మహిళలు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చండీహోమాలు, మహారుద్రాభిషేకం, కుంకుమ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సామూహిక లలితా సహస్రనామ పారాయణం జరిగింది.

భక్తులతో రద్దీగా కుమ్మరిపాలెం క్యూలైను

భవానీపురం, న్యూస్‌టుడే: కుమ్మరిపాలెం వైపు క్యూలైను మార్గం భక్తులతో రద్దీగా మారింది. విద్యాధరపురం, భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, ఖమ్మం, హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇటుగా అమ్మవారి దర్శనానికి వెళ్తున్నారు. కనకదుర్గ పై వంతెన దిగువ నుంచి ఈ క్యూలైను ఏర్పాటు చేశారు. భక్తులు టోల్ గేటు వద్ద ప్రధాన క్యూలైను మార్గంలోకి వెళ్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి సరఫరా, చెప్పుల స్టాండు, క్లోక్‌రూం, తదితర ఏర్పాట్లు చేశారు.



పీఎన్‌బీఎస్ సమీపంలో శ్రీఅన్నపూర్ణాదేవిగా..



మొగల్రాజపురం ధనకొండపై లలిత త్రిపుర సుందరీదేవిగా..



లబ్బీపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



లబ్బీపేట శిర్డీ సాయిబాబా ఆలయంలో..



దర్శిపేటలో రాజరాజేశ్వరీదేవిగా..



మారుతీనగర్ కోకాకోలా కంపెనీ వీధి రామాలయంలో..



బృందావన కాలనీలోని అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ

లలితా త్రిపుర సుందరీ.. రక్షమాం..

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు కొన్నిచోట్ల లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల ప్రత్యేక పూజలు, అన్నాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. కొన్నిచోట్ల భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. - న్యూస్‌టుడే బృందం



పటమట పోలీస్ స్టేషన్‌లో సీఐ పవన్ కిషోర్ పూజలు

నయన మనోహరం.. ఆది దంపతుల నగరోత్సవం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా వేడుకల్లో నాలుగో రోజు ఆదిదంపతుల నగరోత్సవం నయన మనోహరంగా దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆదివారం నిర్వహించింది. గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన పల్లకీలో ఉంచి కనకదుర్గానగర్ పురవీధుల్లో ఊరేగించారు. దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు నగరోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. దేవస్థానం ఉద్యోగులతోపాటు పలువురు పోలీసులు సైతం అమ్మవారి పల్లకీ సేవలో పాల్గొనేందుకు పోటీపడ్డారు.



స్థానాచార్య శివప్రసాదశర్మకు బంగారు నత్తు, ముక్కెర, బొట్టు అందజేస్తున్న దాత నవీన్‌రెడ్డి

జగన్మాత దుర్గమ్మకు బంగారు నత్తు, ముక్కెర, బొట్టు బహూకరణ : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు తిరుపతికి చెందిన నవీన్‌రెడ్డి బంగారు నత్తు, ముక్కెర, బొట్టు ఆదివారం బహూకరించారు. దేవస్థానం స్థానాచార్య శివప్రసాద శర్మకు వాటిని అందజేశారు. డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి ఆలయమర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు ప్రసాదాలను అందజేశారు.

స్నానఘాట్‌ల వద్ద సందడి



భవానీపురం, న్యూస్‌టుడే : దసరా నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులతో పున్నమి, భవానీ స్నాన ఘాట్‌లు సందడిగా మారాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వారి వాహనాలను నిలిపే అవకాశం ఇక్కడ ఉంది. భవానీ ఘాట్ వద్ద రూ.500 టికెటు కొనుగోలు చేసిన వారిని వాహనాల్లో కొండ మీదకు పంపుతున్నారు. వీఐపీలు, ప్రజాప్రతినిధులు వారి కుటుంబ సభ్యులను పున్నమిఘాట్ వద్ద నుంచి ప్రత్యేక వాహనాల్లో కొండ మీదకు పంపిస్తున్నారు.

రారెత్తిస్తున్న టమాటా

కిలో రూ.100 ☛ బెంబేలెత్తిపోతున్న ప్రజలు



పటమట, న్యూస్‌టుడే

నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా మార్కెట్లో కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇటీవల భారీ వర్షాలకు పంటలు నాశనం కావడం దిగుబడి బాగా తగ్గింది. అంతంత మాత్రంగా పండిన ఉత్పత్తులు మార్కెట్‌లోకి వచ్చే సరికి రవాణా ఖర్చులతో కలిపి సడిసి మోపెడవుతున్నాయి. ప్రధానంగా టమాటా, ఉల్లి ధరలు రోజు రోజుకూ పరుగులు పెడుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాట ఏకంగా రూ.వంద ఉండడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. దళారులు ఇదే అదనుగా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. రైతుబజారులో కిలో టమాటా ధర రూ.70కి ఉండగా.. బహిరంగ మార్కెట్‌లో సెంచరీకి చేరుకోవడం ఆందోళన కల్గిస్తోంది. కృత్రిమ కొరత తగ్గించేందుకు మార్కెటింగ్ శాఖ రైతు బజార్లలో ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేసి కిలో రూ.66కి విక్రయిస్తోంది. కానీ ఇంతకంటే తక్కువ ధరకు ఎక్కువ టమాటా అందుబాటులోకి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే ధరల జోరుకు కళ్లెం పడే అవకాశం ఉండదని వాపోతున్నారు.



పటమట రైతుబజారులో ప్రత్యేక స్టాళ్లలో విక్రయాలు

రాయితీపై అందజేయాలి



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పనుల్లేక ఆర్థికంగా నష్టపోయాం. ఇదే సమయంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. గత వారం కిలో టమోటా ధర రూ.40 ఉంది. ఇప్పుడు రైతుబజార్‌లోనే ఈ ధర దాదాపు రెట్టింపు అయ్యింది. బయట మార్కెట్‌లో అడిగితే అసలు కొనే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టమాటా, ఉల్లిపాయలు అందజేస్తే సామాన్య ప్రజలకు అండగా ఉంటుంది. **- శ్రీనివాస్, వినియోగదారుడు**

పండగ గడవడం కష్టమే



దసరా ముందు నిత్యావసర ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. వంట నూనె, అల్లం, వెల్లుల్లి, కూరగాయలు, ఉల్లిపాయలు ఇలా అన్నీ ధరలు కొండెక్కి కూర్చున్నాయి. దీంతో బడ్జెట్ తల్లకిందులైంది. దీనికితోడు కొంత మంది దళారులు కృతిమ కొరత సృష్టిస్తుండడంతో జేబులు గుల్లవుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటే మేలు. **- ఎన్.మోహన్‌రావు**

ప్రైవేటు పాఠశాలకు రూ.లక్ష జరిమానా

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించిన కృష్ణలంకలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యానికి రూ.లక్ష జరిమానా విధించినట్టు డీఈవో యూవీ సుబ్బారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం అక్కడ తరగతులు నిర్వహిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు విద్యాశాఖాధికారులు పాఠశాలను పరిశీలించగా.. నిజమేనని తేలిందని పేర్కొన్నారు. సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కళాశాలలను మూసివేయించిన నాయకులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించిన కళాశాలలను విద్యార్థి సంఘం నాయకులు మూసివేయించారు. మొగల్రాజపురం, బెంజిసర్కిల్‌లో ఇంటర్మీడియట్ కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఆదివారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో నాయకులు అక్కడకు వెళ్లారు. దసరాకు సెలవులు ఇస్తే కళాశాలలు ఎందుకు నిర్వహిస్తున్నారని వారు నిర్వాహకులను ప్రశ్నించారు. మూసివేయకపోతే అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో తరగతి గదుల్లో ఉన్న విద్యార్థులను నాయకులు బయటకు పంపించేశారు.

సినీనటుడు రాజేంద్రప్రసాద్‌కు ఎమ్మెల్యే గద్దె పరామర్శ



పటమట, న్యూస్‌టుడే: సినీ నటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి హైదరాబాద్‌లో మృతి చెందడంతో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కుటుంబ సభ్యులు అనురాధ, క్రాంతి కుమార్‌లు ఆదివారం అక్కడకు వెళ్లి పరామర్శించారు. గాయత్రి మృతదేహానికి నివాళులర్పించి అనంతరం రాజేంద్రప్రసాద్, గాయత్రి భర్త రాజ్‌కుమార్, కుమార్తె సాయి తేజస్వినిలకు సానుభూతి తెలిపారు.

ఆలిండియా శాయ్ కెనోయ్‌లో ప్రతిభ



పతకాలతో వర్షిత

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం అలెప్పీలోని జాతీయ క్రీడాప్రాధికార సంస్థ(శాయ్) నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (ఎన్‌సీవోఈ)లో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన 9వ ఆలిండియా ఇంటర్ శాయ్ కెనో స్ప్రింట్ ఛాంపియన్‌షిప్-2024లో నగరానికి చెందిన గొలుగూరి వర్షిత మూడు రజత, ఒక కాంస్య పతకాలతో సత్తా చాటింది. ఒడిశాలోని జగత్‌పూర్ శాయ్ ఎన్‌సీవోఈలో శిక్షణ పొందుతున్న వర్షిత కే4-500 మీటర్లు, కే4-1,000 మీటర్లు, కే2-200 మీటర్ల కెనోయ్‌లో ద్వితీయ స్థానాల్లో నిలవగా.. కే2-500 మీటర్లలో తృతీయ స్థానంలో నిలిచింది. నగరంలోని ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లో ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న వర్షితను స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ రాయప్పరెడ్డి అభినందించారు.

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యం

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా నోవా అగ్రి గ్రూప్ నిరంతరం సేవలందిస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో ఆదివారం నోవా ఫ్యామిలీ మెంట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్కడితో మొదలైన నోవా అగ్రి గ్రూప్ ప్రస్తుతం వేలాది మంది ఉద్యోగులు, డీలర్లతో దేశవ్యాప్తంగా అన్నదాతల మన్ననలు పొందుతూ అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ ఏటుకూరి కిరణ్‌కుమార్, సీఈవో మందలపు శ్రీనివాసరావు, డైరెక్టర్ రాజేష్, జాతీయ మార్కెటింగ్ హెడ్ హర్ష, ప్రాంతీయ మేనేజన్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. తల్లి దుర్మరణం

తండ్రీ కుమార్తెల పరిస్థితి విషమం



ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు



ఆసుపత్రిలో చిన్నారి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తల్లి మృతి చెందగా, తండ్రి, మరో కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం వణుదుర్రుకు చెందిన మైనాకు విజయవాడకు చెందిన కిరణ్‌తో ఆరేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. విజయవాడ నుంచి భర్త, కుమార్తెలతో మైనా వణుదుర్రులోని పుట్టింటికి రెండ్రోజుల కిందట వచ్చింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో తిరిగి ద్విచక్ర వాహనంపై విజయవాడకు బయలుదేరారు. సింగరాయపాలెం పెట్రోలు బంక్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. ప్రమాదంలో మైనా(25) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త కిరణ్, అయిదేళ్ల పెద్ద కుమార్తె, మరో ద్విచక్రవాహనంపై ఉన్న యువకుడిని 108లో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలో ఉన్న చిన్న కుమార్తె పరిస్థితి విషమంగా ఉండటంతో ఎస్సై వెంకటకుమార్, సిబ్బంది వారి వాహనంలో ముదినేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి గుడివాడ తరలించడానికి 108 కోసం ఎంత ప్రయత్నించినా అవి అందుబాటులోకి రాలేదు. చివరికి సింగరాయపాలెంలోని ఓ పరిశ్రమకు చెందిన అంబులెన్స్‌లో గుడివాడ ఆసుపత్రికి తరలించారు. మరో ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు ఉన్నట్లు సమాచారం. బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడేనికి చెందిన వారుగా స్థానికులు భావిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

❖ పైపు లైన్‌కు మరమ్మతులు : మూడో డివిజన్ శ్రీరామచంద్రనగర్ మహానాడు రోడ్డులో తాగునీటి పైపులైను లీకేజీ అవుతోందని స్థానిక నివాసి కార్తీక్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించారు.

? నాలుగో డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంకు ఎన్‌సీసీ క్యాంటీన్ రోడ్డులో కొత్త రోడ్డు వేసేందుకు గ్రావెల్ తోలించి రెండు నెలలు కావడంతో రాళ్లు పైకి లేచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- రమణ మూర్తి**

✔ కొత్త రోడ్డు ఏర్పాటు చేస్తాం **- సామ్రాజ్యం, ఈఈ**

? 5వ డివిజన్ ఫిలిం కాలనీ పార్కు సమీపంలో చెత్త కుప్పలు మేటలు వేశాయి. **- నాగేంద్ర**

✔ చెత్త తొలగిస్తాం. **- కె.వెంకటేశ్వరరావు, శానిటరీ అధికారి.** – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ప్రమాణస్వీకారం నేడు

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా పి.ఎస్. మునిరత్నం సోమవారం ఉదయం ఆర్టీసీ హౌస్‌లోని కార్యాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం చేస్తారని ప్రజా సంబంధాల అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తారని చెప్పారు.

ముఖ్యమంత్రి దృష్టికి బీసీల సమస్యలు



సమావేశమైన చాంద్, నాగేశ్వరరావు, రాజు, రవికుమార్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : నగరంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని బీసీ ఐక్యవేదిక నగర అధ్యక్షుడిగా నియమితులైన వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత అధికారి, ఏపీ ఎన్జీవో మాజీ నేత పి.వి.ఎల్.ఎన్.రాజు తెలిపారు. ఆదివారం చాంద్ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో సంఘం నాయకులు.. నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యవేదిక కమిటీలో వెనుకబడిన తరగతులకు చెందిన అన్ని కులాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. నగరంలో సంఘీయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. అధ్యక్ష పదవి అప్పగించినందుకు ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు కె.చాంద్, అధ్యక్షుడు బుద్దా నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బొమ్మిన రవికుమార్ నియమితులయ్యారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాయిన శేఖర్‌బాబు, వెనిగళ్ల నాగదుర్గారావు, షేక్ బాజి, డాక్టర్ ధన్వంతరి, కె.వీర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఇద్దరి బలవన్మరణం

కొండపల్లి, న్యూస్‌టుడే: కుటుంబ వ్యవహారాల్లో నెలకొన్న సమస్యలకు తాళలేక ఇరువురు బలవన్మరణం చెందిన సంఘటనలు కొండపల్లిలో వేర్వేరు చోట్ల ఆదివారం చోటుచేసుకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శాలివాహన బజార్‌లో నివసించే అశోక్(35) ఓ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతడికి కంచికచర్లకు చెందిన రమణతో ఆరేళ్ల కిందట వివాహమవగా.. ఓ పాప సంతానం. కొంత కాలంగా భార్య భర్తల మధ్య వివాదాలు నెలకొని ఎవరికి వారు పుట్టిళ్లలో ఉంటున్నారు. ఆదివారం ఉదయం అశోక్ తన తల్లిదండ్రులతో భార్య, పాప గురించి మాట్లాడాడు. కొంత సేపటికి గదిలోకి వెళ్లిపోయాడు. నిద్రపోతున్నాడనుకున్న తలిదండ్రులు మధ్యాహ్నానికి చూసే సరికి ఉరివేసుకొని కనిపించడంతో బోరుమన్నారు. ఇదిలా ఉంటే మరో సంఘటనలో యాదవుల బజార్‌లో నివాసముండే ఈశ్వరి(30)కి ఏడాది కిందట విజయవాడకు చెందిన యువకుడితో వివాహమైంది. కొన్ని నెలలుగా భార్యభర్తల మధ్య వివాదం నెలకొనగా ప్రస్తుతం పుట్టింట్లోనే ఉంటోంది. ఆదివారం ఉదయం తలిదండ్రులు ఓ శుభకార్యానికి వెళ్లగా ఒంటరిగా ఉన్న ఈశ్వరి కొంతసేపటికి వాళ్లకు ఫోన్ చేసి వస్తున్నారా అని అడిగింది. సాయంత్రం వారు ఇంటికి వచ్చే సమయానికి ఇంట్లో ఉరివేసుకొని ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం ఘటనలో కొడుకు మృతి

మధురానగర్, న్యూస్‌టుడే : వివిధ రకాల సమస్యలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో కుమారుడు మృతిచెందారు. కృష్ణలంకకు చెందిన బొర్రా ప్రసాద్.. గుణదల ఊర్మిళా నగర్‌లో ఉంటున్నారు. అతని కుమారుడు శివకుమార్ (32) అనారోగ్యంతో మంచంలోనే ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవనం కష్టంగా మారడంతో శుక్రవారం రాత్రి ప్రసాద్.. తాను పురుగుల మందు తాగి, కుమారుడికి తాగించారు. ఈ ఘటనలో ప్రసాద్ చనిపోయిన విషయం తెలిసిందే. కొన ఊపిరితో ఉన్న శివకుమార్‌ను ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

ఏడుగురి అరెస్టు

పెదకాకాని, న్యూస్‌టుడే: యువతకు గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని నంబూరుకు చెందిన ప్రైవేటు ఉద్యోగి వాసా రాజేష్, ట్రాక్టర్ డ్రైవర్ తాడిబోయిన గోపి కృష్ణ, కూల్‌డ్రింక్ దుకాణం నిర్వాహకుడు దుర్గపు పవన్ కుమార్ స్నేహితులు. ఈ ముగ్గురు జల్సాలకు అలవాటు పడి గంజాయి తెప్పించి విక్రయిస్తున్నారు. వీరికి గంజాయి వ్యాపారం చేసే అనగాని రాఘవేంద్ర (కృష్ణా జిల్లా ఉయ్యూరు), తాతా హేమంత్ (ఏలూరు జిల్లా నూజివీడు), విజయవాడ పడమటకు చెందిన పండాలనేని వెంకట శివ గణేశ్‌కుమార్, ప్రతివాడ శివాజీ తోడయ్యారు. ఈ నెల 5వ తేదీ రాత్రి ఈ నలుగురు గంజాయి తీసుకొచ్చి నంబూరులోని ఓ కాలనీ వద్ద ఉన్న రాజేష్, గోపి కృష్ణ, పవన్‌కుమార్‌లకు ఇచ్చారు. అందరూ కలిసి గంజాయిని చిన్న పొట్లాలుగా ప్యాకింగ్ చేస్తున్నారు. అదే సమయంలో పెదకాకాని సీఐ నారాయణ స్వామి, కానిస్టేబుళ్లు దాడి చేసి ఈ ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు కేజీల గంజాయి (విలువ రూ.60వేలు), మూడు ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ కృష్ణకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితులను ఆదివారం రిమాండ్‌కి పంపినట్లు సీఐ తెలిపారు.

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు



వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కార్పొరేట్ ఆస్పత్రులు ముందుకు రావడం సంతోషకరమని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు చింతల సీతారామయ్య చొరవతో విజయవాడకు చెందిన స్రవంతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం పెనుగంచిప్రోలు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని శ్రీరాం తాతయ్య ప్రారంభించారు. గుండె, ఎముకలు, జీర్ణకోశం వంటి వ్యాధులతో పాటు రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ విజయ శ్రీనివాస్, ఆస్పత్రి వైద్య బృందం 300 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి కృష్ణమూర్తి, కాకాని శ్రీనివాసరావు, జిల్లేపల్లి సుధీర్‌బాబు, కర్ల వెంకటనారాయణ, నూతలపాటి చెన్నకేశవరావు, కె.బ్రహ్మం, కె.సతీష్, ఎం.వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మంత్రులను కలిసిన సామినేని



తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను తెలంగాణ సచివాలయంలో జనసేన నాయకుడు సామినేని ఉదయభాను మర్యాదపూర్వంగా కలిశారు.

– న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం

10న అవిముక్తేశ్వర సరస్వతి స్వామి పర్యటన



ఎమ్మెల్యే సౌమ్యకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న గోధ్వజ్ కమిటీ సభ్యులు

నందిగామ, న్యూస్‌టుడే: గోవును జాతీయ మాతగా ప్రకటించాలని చట్టం చేయాలని కోరుతూ ఈనెల 10న ఉత్తరాఖండ్ జ్యోతిర్మఠ్ పీఠాధిపతి అవిముక్తేశ్వర సరస్వతి స్వామి విజయవాడకు వస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను ఆదివారం గోధ్వజ్ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులోని శృంగేరి పీఠం వారి రామకోటి తీర్థంలో అనుగ్రహ భాషణం ఉంటుందని చెప్పారు. అదేరోజు నందిగామలోని శివాలయానికి వస్తారని చెప్పారు. కార్యక్రమంలో గోధ్వజ్, గోప్రతిష్ఠాపన కమిటీ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య, కమిటీ సభ్యులు నందిరాజు ప్రకాష్, కొమరగిరి వాచస్పతి, వందేమాతరం అశోక్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పిస్తే.. పతకాలు సాధిస్తాం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే



ఈత నేర్చుకుంటున్న మహిళలు, బాలలు

జగ్గయ్యపేట ప్రాంతానికి సుమారు రెండు దశాబ్దాలుగా సహజమైన ఈత కొలనులా ఉపయోగపడుతున్న అగ్రహారం పాలేరు మరిన్ని సౌకర్యాలను కోరుకుంటోంది. ఇప్పటి వరకు శిక్షకులు, సాధకులే తమ సొంత నిధులతో ఇక్కడ స్నానఘట్టాన్ని ఈతకు అనుకూలంగా మార్చుకున్నారు. అగ్రహారంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న పాలేటి స్నానఘట్టాన్ని ఈత సాధనకు వేదిక చేయడంలో జరుగుతున్న కృషికి తోడు ప్రభుత్వం నుంచి కూడా సహకారం ఉంటే క్రీడాభివృద్ధితో పాటు పర్యాటకాభివృద్ధి కూడా అక్కడ సాధ్యమవుతుంది.

వందలాది మందికి శిక్షణ

20 ఏళ్ల ఏళ్ల కిందట తన కాళ్లు పూర్తిగా పని చేయని స్థితిలో ఇక్కడ వైద్యంలో భాగంగా ఈత కొట్టేందుకు వచ్చిన ఆర్టీసీ డ్రైవర్ మోహనరావు ఈ పాలేటికి ఉన్న ప్రత్యేకత గుర్తించి తానే శిక్షకుడిగా మారి వందల మందికి ఈత నేర్పారు. అనంతరం అనేక మంది అదే బాటలో ఇక్కడ శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం పొట్లూబత్తిన పాండురంగారావు, లక్ష్మీ దంపతులు డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ పేరుతో ఒక పటిష్ఠమైన ఈత శిక్షణ కేంద్రం నడుపుతున్నారు. గతంలో జగ్గయ్యపేట సీఐగా చేసిన ఎం.కిషోర్‌బాబు ఈ ప్రాంతంలో ఈత శిక్షణను ఒక ఉద్యమంగా మార్చి కృష్ణా స్విమర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి ఎంతో మందిని ప్రోత్సహించారు. అదే ఇక్కడి క్రీడాకారులను అంతర్జాతీయ పోటీల్లో సైతం విజేతలుగా నిలిపేలా చేసింది. ఇప్పటికే క్రీడాకారులు, దాతల చొరవతో అక్కడ డైవింగ్ కోసం ఒక కాంక్రీట్ నిర్మాణం, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు, ఇతర ఏర్పాట్లు చేసుకున్నారు. పక్కనే ఉన్న ఆలయం కూడా వారికి మంచి ఉపయోగకరంగా మారింది. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి స్నానాల గదులు, సేదతీరే వనరుల వంటి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే పేట ప్రాంతంలోని ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుందని సాధకులు అంటున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తాగునీటి పథకం పైపులైన్ మరమ్మతు పనులను సత్వరం పూర్తిచేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆదేశించారు. ఆదివారం పెనుగంచిప్రోలు వచ్చిన ఆయన దృష్టికి స్థానికులు తాగునీటి సమస్యను విన్నవించారు. మునేరుకు వరద వచ్చిన నాటి నుంచి సుమారు నెల రోజులుగా తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. ఇళ్లలో బోర్లు లేకపోవడంతో ఇతర అవసరాలకు నీరు కరవైందని డౌన్ సెంటర్ మహిళలు వాపోయారు. స్పందించిన శ్రీరాం తాతయ్య వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డీఈ, పంచాయతీ కార్యదర్శితో చరవాణిలో మాట్లాడారు. పనులు సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

మహిళలకు చీరల పంపిణీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొణతమాత్మకూరులో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు దసరా వేడుకలను పురస్కరించుకుని వంద మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.సుందర్, విజయ్, సందీప్, సాయి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి శిక్షణ కార్యక్రమం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: చిల్లకల్లులోని మండల పరిషత్తు కార్యాలయంలో రెండు రోజులు పంచాయతీలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.నితిన్ తెలిపారు. కార్యక్రమంలో సాధారణ పరిపాలనా విధానం, ఏపీపీఆర్ చట్టం-1994 ముఖ్య నిబంధనల అంశాలపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి ఒక ఉప సర్పంచి, ఇద్దరు వార్డు మెంబర్స్ హాజరు కావాలని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

గోమాత రక్షణకు చట్టం చేయండి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: గోమాతను జాతీయమాతగా గుర్తించడం ద్వారా ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకొచ్చేలా కృషి చేయాలని ఉత్తరాఖండ్ జ్యోతిర్మఠం పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య అవిముక్తేశ్వర సరస్వతి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు సూచిస్తూ ఒక ప్రతిపాదన పత్రాన్ని అందించారు. విజయవాడ బీఆర్‌టీ రోడ్డులోని శృంగేరీ పీఠం వారి రామకోటి తీర్థంలో ఈనెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించేబోయే ప్రత్యేక సదస్సుకు తాతయ్యకు ఆహ్వానం అందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వత్సవాయి, న్యూస్‌టుడే: మండలంలోని కన్నెవీడు హైస్కూల్లో 1980-85లో చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఘనంగా జరిగింది. నలభై ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్న వారంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని ఉత్సాహంగా గడిపారు. అప్పటి గురువులు యలమంచలి నాంచారబాబు, రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. సర్పంచి చావా దుర్గారాణి, నాయకులు కర్పాటి అప్పారావు, రఘు, చావా శ్రీధర్ పాఠశాల అభివృద్ధి గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వాసిరెడ్డి సురేష్, కొమ్మినేని మధు, జీవనజ్యోతి, బంకా ఉమా పాల్గొన్నారు.



వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం



కొండ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్, అనుబంధ సంఘాల సేవలు అభినందనీయమని ఎమ్మెలే శ్రీరాతాతయ్య అన్నారు. జగ్గయ్యపేట వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన కర్లపాటి కొండ, శోభారాణిల ప్రాంతీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని వారిని సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ అనేక సందర్భాల్లో వాసవి క్లబ్ చేసిన సేవలను గుర్తు చేశారు. 11 క్లబ్బులతో కలిసి సాగిన సమ్మేళనంలో జిల్లా గవర్నర్ తూనుకుంట్ల శ్రీధర్, ప్రతినిధులు దుడ్డ నాగేశ్వరరావు, చిన్న ప్రసాద్, కాకరపర్తి సోమేశ్వరరావు, మద్దుల ఉమమహేశ్వరరావు, కొత్తకృష్ణారావు, డోగుపర్తిసందీప్, నూకలబాలకృష్ణ, మహంకాళి జయప్రకాష్, పబ్బతి సత్యనారాయణ, నాగమణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మండల ఆర్యవైశ్య సంఘ కార్యవర్గం ఎన్నిక

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు మండల ఆర్యవైశ్య కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక జమ్మిచెట్టు రామాలయం కల్యాణ మండపంలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొని నూతనంగా ఎంపికైన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా నకిరికంటి మంగపతిగుప్తా, అధ్యక్షుడిగా మహంకాళి మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శిగా వంగవీటి ఈశ్వరరావు, కోశాధికారిగా స్వామి నారాయణరావులను ఎన్నుకున్నారు. మండల మహిళా సంఘ అధ్యక్షురాలిగా మహంకాళి రమ్య, కార్యదర్శిగా పారేపల్లి గాయత్రి, కోశాధికారిగా సీతామహాలక్ష్మి ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బొగ్గవరపు వెంకట రాజారావు, కొప్పు రజని పాల్గొన్నారు.

ఆలయంలో సంప్రదాయ దుస్తులు ధరించాలని ఆదేశాలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయంలో ఉద్యోగుల డ్రెస్ కోడ్‌పై ఇటీవలే ఈవోగా బాధ్యతలు చేపట్టిన కిశోర్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా రంగుల దుస్తులు ధరించి విధుల్లో ఉండటాన్ని గమనించిన ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు తప్పనిసరిగా సంప్రదాయంగా ఉండే తెల్లటి వస్త్రాలతో కూడిన లుంగీలు, పంచెలు ధరించాలని ఆదేశాలు ఇచ్చారు. సిబ్బంది, ఆలయ అధికారులు మెడలో గుర్తింపు కార్డులు తప్పనిసరిగా వేసుకోవాలని చెప్పారు. అమ్మవారి దర్శనానికి సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన బాలుడిని సత్కరించారు. భక్తులు సైతం సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి రావాలని ఆయన కోరారు.

రహదారి దుర్గంధభరితం



కంచికచర్ల-గొట్టుముక్కల రహదారి పక్కన చెత్త

కంచికచర్ల నుంచి గొట్టుముక్కల వెళ్లే రహదారికి ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు దుర్గంధం భరించలేక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. పంచాయతీ సిబ్బంది సేకరించిన చెత్తను రహదారికి ఇరువైపులా పోస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. స్వచ్ఛతా హీ సేవా అంటూ అధికారులు కార్యక్రమాలు నిర్వహించడమే తప్ప ఆచరణలో పాటించడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పక్కన ఉన్న చెత్తను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కంచికచర్ల



నందిగామ గ్రామీణం: లలితాత్రిపురసుందరిగా శుకశ్యామలాంబ



నందిగామ గ్రామీణం: మంగళ గౌరీదేవిగా కనకదుర్గమ్మ



నందిగామ గ్రామీణం: అంబారుపేటలో అన్నపూర్ణాదేవిగా..



జగ్గయ్యపేట గ్రామీణం: ముక్త్యాలలో..



జగ్గయ్యపేట గ్రామీణం: అనుమంచిపల్లి గ్రామంలో..



నందిగామ గ్రామీణం: లింగాలపాడులో..

లలితాత్రిపుర సుందరీ పాహిమాం

నందిగామ గ్రామీణం: నందిగామ శివాలయంలో దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం శుకశ్యామలాంబ అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు దండిభొట్ల బాలకృష్ణ శాస్త్రి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అంబారుపేటలో సత్యమ్మతల్లిని అన్నపూర్ణాదేవిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పల్లగిరిపై త్రిశక్తి దేవాలయంలో కనకదుర్గమ్మను మంగళగౌరీదేవిగా అలంకరించారు. దాములూరులో మహిళలు బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించి కోలాటం ఆడారు.

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో దేవీనవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో భాగంగా నాల్గో రోజు అమ్మవారు శ్రీలలిత త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తున్నారు. అమ్మవారి మండపాల వద్ద ప్రతిరోజు సామూహిక కుంకుమార్చణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కంచికచర్ల: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని పలు ఆలయాల్లో దసరా ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కంచికచర్ల శివాలయంలో గజలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పశువుల ఆసుపత్రి దారిలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

పెనుగంచిప్రోలు: దుర్గాదేవి మండపాల్లో శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో అమ్మవారిని దర్శించుకున్న శ్రీరాంతాతయ్య ప్రత్యేక పూజలు చేశారు.



కంచికచర్ల పశువుల ఆసుపత్రి మార్గంలో..




జగ్గయ్యపేట: లలితా త్రిపురసుందరిగా దుర్గాపురం కనకదుర్గ



జగ్గయ్యపేట: మహాలక్ష్మి ఆలయంలో ..



జగ్గయ్యపేట: కాత్యాయనిగా



నవాబుపేటలో..



పెనుగంచిప్రోలు: తూర్పుబజారులో..

విద్యాలయానికి రూ.5 లక్షల వితరణ

శత వసంతోత్సవ సందర్భంగా వేదిక నిర్మాణం

న్యూస్‌టుడే, జగ్గయ్యపేట



తుది మెరుగులు దిద్దుకుంటున్న నిర్మాణం

వందేళ్లకుపైగా విద్యా సేవలో తరించిన ఆ పాఠశాల శత వసంతోత్సవం కోసం అవసరమైన వేదికను శాశ్వతంగా నిర్మించేందుకు చొరవ చూపిన పూర్వ విద్యార్థి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. తల్లిదండ్రుల పేరిట రూ.5 లక్షల వ్యయంతో కళా వేదిక, జాతీయ పతాక దిమ్మె ఏర్పాటు చేశారు. దసరా సెలవులు పూర్తైన తర్వాత లాంఛనంగా ప్రారంభించబోతున్న ఈ వేదికపైనే పాఠశాల శతవసంతాల వేడుక కూడా జరగనుండటం మరో విశేషం. జగ్గయ్యపేటలో 1917లో నెలకొల్పిన గెంటేల వెంకట జోగయ్య జిల్లా పరిషత్ పాఠశాల ఇప్పటికే శతాధిక వసంతాలను పూర్తి చేసుకున్నా వివిధ కారణాల వల్ల వేడుకలు జరుపుకోలేదు. ఈలోపు పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేపట్టడం, పాత భవనాలు కూల్చివేయడం వంటి అనేక కారణాలతో ఉత్సవం వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం అదే పాఠశాలలో చదువుకొని, అక్కడే ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బాదె నాగేశ్వరరావు మొత్తం వ్యయాన్ని తానే భరించి తన తల్లిదండ్రులు శ్రీ పూర్ణానంద బాదే సత్యనారాయణ - వీరమ్మల పేరుతో వేదికను పూర్తి చేశారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు బాదె నాగేశ్వరరావు దంపతులను అభినందిస్తున్నారు.

అదృష్టంగా భావిస్తున్నాం

మా గురువు గెంటేల వెంకటరమణ స్ఫూర్తితో ఈ సత్కార్యం చేశాం. చదువుకున్న పాఠశాలలో శాశ్వతంగా ఉండే కళా వేదిక నిర్మించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాం. ఎంతో మంది ముందుకొచ్చినా అదే పాఠశాలలో విద్యార్థిగా, ఉపాధ్యాయుడిగా ఉన్న మాకు ఈ అవకాశం లభించింది. అదే వేదికపై శత వసంతాల వేడుక కూడా జరగబోవడం ఇంకా సంతోషకరమైన విషయం.

- బాదె నాగేశ్వరరావు దంపతులు

ఉరుములు.. మెరుపులతో వర్షం



అల్లూరు విద్యుత్తు ఉప కేంద్రం వద్ద కురుస్తున్న భారీ వర్షం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ పరిసరాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగాయి. గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం వరకు ఎండ, ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం కురిసిన వర్షానికి సేదతీరారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వీరులపాడు, న్యూస్‌టుడే : మండల వ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో అల్లూరు విద్యుత్తు ఉప కేంద్రంలో కండక్టర్ తెగిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉప కేంద్రం పరిధిలోని గ్రామాలకు రెండు గంటల అనంతరం విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలులు రావడంతో పలు చోట్ల పంటలు నేల వాలినట్లు రైతులు తెలిపారు.

రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపిక

స్టాండ్‌బైగా రాజేష్



వరుణ్‌సాత్విక్

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పంజాబ్‌లోని మోహాలీ వేదికగా వినూ మన్కడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి అండర్-19 ఒన్‌డే క్రికెట్ పోటీలకు వెళ్లిన రాష్ట్ర జట్టులో జగ్గయ్యపేటకు చెందిన టి.వరుణ్ సాత్విక్ బ్యాట్స్‌మెన్‌గా స్థానం సాధించుకున్నారు. స్థానిక బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందే వరుణ్ జాతీయ స్థాయిలో ఆడడం ఇది నాలుగో సారి. ఇదే ప్రాంతానికి చెందిన ఎన్.రాజేష్ కూడా ఇదే జట్టులో స్టాండ్‌బై ప్లేయర్‌గా స్థానం సాధించాడు. జగ్గయ్యపేట అకాడమి కోచ్ ఎన్.రాజేంద్రతోపాటు స్థానిక క్రీడాకారులు వీరికి అభినందనలు తెలిపారు.

గంజాయి మత్తులో ఆగడాలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర సరిహద్దుగా ఉన్న జగ్గయ్యపేట ప్రాంతంలో గంజాయికి అలవాటు పడిన యువత ఆగడాలు హద్దులు దాటుతున్నాయి. పోలీసులు, ఇతర నిరోధక శాఖలు తీవ్ర కసరత్తు చేసి అనేక సార్లు గంజాయి నిల్వలను, సరఫరాలను, సరఫరా చేసే ముఠాలను పట్టుకున్నా ఇంకా వినియోగించే వారి సంఖ్య మాత్రం తగ్గలేదు. గతంలో ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సీసీ కెమెరాలు పగలగొట్టిమరీ అదే పాఠశాలలో దొంగతనం చేసిన సంఘటనలు కూడా నమోదయ్యాయి. ఇటీవల దీనికి మించిన మరో నేరం ఆలస్యంగా వెలుగు చూసింది.

- నియోజకవర్గ పరిధిలోనే పాతికేళ్ల వయసున్న కార్మిక యువకుడు గంజాయి మత్తులో 12 ఏళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆ ప్రాంతంలో తీవ్ర సంచలనం అయింది. అతనికి దేహశుద్ధి చేయడం, పోలీసులకు అప్పగిస్తే వారు తమదైన శైలిలో విచారించారు.
- ఈ ఘటనలో నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. గంజాయి సరఫరా చేసే ముఠాలను, గంజాయి అమ్మకం కేంద్రాలను, గంజాయి మత్తులోకి యువతను లాగే బృందాలను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో లయన్స్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎం.పద్మ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మండదపు సీతారామయ్య, కార్యదర్శి కె.లక్ష్మీకాంత్, కోశాధికారి ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

నందిగామ, న్యూస్‌టుడే: మండలంలోని మునగచర్ల సమీపంలో ఆదివారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ వైవీఎల్ నాయుడుకు అందిన సమాచారం ప్రకారం ఎస్సై శాతకర్ణి పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో జూదమాడుతున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో బలవన్మరణం

కొండపల్లి, న్యూస్‌టుడే: కుటుంబ వ్యవహారాల్లో నెలకొన్న సమస్యలకు తాళలేక యువకుడు బలవన్మరణం చెందిన సంఘటన కొండపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శాలివాహన బజార్‌లో నివసించే అశోక్ (35) ఓ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతడికి కంచికచర్లకు చెందిన రమణతో ఆరేళ్ల కిందట వివాహమవగా..ఓ పాప సంతానం. కొంత కాలంగా భార్యభర్తల మధ్య వివాదాలు నెలకొని ఎవరికి వారు పుట్టిళ్లలో ఉంటున్నారు. ఆదివారం ఉదయం అశోక్ తన తల్లిదండ్రులతో భార్య, పాప గురించి మాట్లాడాడు. కొంత సేపటికి గదిలోకి వెళ్లిపోయాడు. నిద్రపోతున్నాడనుకున్న తలిదండ్రులు మధ్యాహ్నానికి చూసే సరికి ఉరివేసుకొని కనిపించడంతో బోరుమన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ



ప్రమాదంలో గాయపడిన యువకుడు

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన పరిటాల శివారు వద్ద ఆదివారం జరిగింది. ఎస్సై బోనగిరి రాజు తెలిపిన వివరాల మేరకు.. వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన కొమెర వెంకటేశ్వర్లు టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం విధులు ముగిసిన అనంతరం ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపట్నం నుంచి కంచికచర్ల వైపు వస్తుండగా, పరిటాల శివారు వద్ద కంచికచర్ల నుంచి విజయవాడ వైపు వెళుతున్న కంటైనర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు కుడి కాలు విరగడంతో పాటు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

✪ ఈ ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ ఈ నెల 3న జుజ్జూరు వద్ద గేదెలను ఢీకొనడంతో నాలుగు గేదెలు మృతి చెందగా, కాపరులు ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అప్పటి నుంచి వీరులపాడు పోలీసుల అదుపులో ఉన్న ఈ లారీ రిలీజింగ్ ఆర్డర్ తీసుకొని వీరులపాడు పోలీస్ స్టేషన్ నుంచి బయల్దేరిన కొద్ది సేపటికే కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మరొక ప్రమాదానికి కారణమైంది. తమిళనాడుకు చెందిన ఈ లారీ నెంబరు. TN 18 AS 9492. డ్రైవర్ పేరు అబ్దుల్ షాజహాన్. ఒకే లారీ, ఒకే డ్రైవరు రెండు రోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలకు కారణమైంది.

విజయవాడ పశ్చిమ

అనధికార దర్శనాల కట్టడికి చర్యలు

చిట్టినగర్, న్యూస్‌టుడే : అమ్మవారి దర్శనానికి డ్యూటీ, ఇతర పాసులు, టిక్కెట్లతో వచ్చే అనధికారిక దర్శనాలను అరికట్టేందుకు దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామారావు ఆదివారం తెల్లవారుజామున క్యూలైన్లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామునుంచే భక్తుల రద్దీ పెరిగింది. అదే సమయంలో రకరకాల పాసులు, దర్శనం టిక్కెట్లను క్యూలైన్లలో ఈవో పరిశీలించారు. వాటి క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ ద్వారా తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు చేశారు. సౌకర్యాల గురించి భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.


పాసులు పరిశీలిస్తున్న ఈవో రామారావు

భక్తులతో రద్దీగా కుమ్మరిపాలెం క్యూలైను

భవానీపురం, న్యూస్‌టుడే : కుమ్మరిపాలెం వైపు క్యూలైను మార్గం భక్తులతో రద్దీగా మారింది. విద్యాధరపురం, భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, జక్కంపూడి, హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇటుగా అమ్మవారి దర్శనానికి వెళ్తున్నారు. కనకదుర్గ పై వంతెన దిగువ నుంచి ఈ క్యూలైను ఏర్పాటు చేశారు. భక్తులు టోల్ గేటు వద్ద ప్రధాన క్యూలైను మార్గంలోకి వెళ్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి సరఫరా, చెప్పుల స్టాండు, క్షౌరశాల, తదితర ఏర్పాట్లు చేశారు.


క్యూలైనులో వెళ్తున్న భక్తులు

స్నాన ఘాట్ల వద్ద సందడి


జల్లు స్నానం చేస్తున్న భక్తులు

భవానీపురం, న్యూస్‌టుడే : దసరా నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులతో పున్నమి, భవానీ స్నాన ఘాట్లు సందడిగా మారాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వారి వాహనాలను నిలిపే అవకాశం ఇక్కడ ఉంది. భవానీ ఘాట్ వద్ద రూ.500 టికెట్లు కొనుగోలు చేసిన వారిని వాహనాల్లో కొండ మీదకు పంపుతున్నారు. వీవీఐపీ, ప్రజాప్రతినిధులు వారి కుటుంబ సభ్యులను పున్నమిఘాట్ వద్ద నుంచి ప్రత్యేక వాహనాల్లో కొండ మీదకు పంపిస్తున్నారు.


వీఐపీ కేంద్రం వద్ద భక్తులు...

నయన మనోహరం.. ఆది దంపతుల నగరోత్సవం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా వేడుకల్లో నాలుగో రోజు ఆది దంపతుల నగరోత్సవం నయన మనోహరంగా దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆదివారం నిర్వహించింది. గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన పల్లకీలో ఉంచి కనకదుర్గనగర్ పురవీధుల్లో ఊరేగించారు. దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు నగరోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. దేవస్థానం ఉద్యోగులతోపాటు పలువురు పోలీసులు సైతం అమ్మవారి పల్లకి సేవలో పాల్గొనేందుకు పోటీపడ్డారు.


స్థానాచార్య శివప్రసాదశర్మకు బంగారు నత్తు, ముక్కెర, బొట్టు అందజేస్తున్న దాత నవీన్‌రెడ్డి

జగన్మాత దుర్గమ్మకు బంగారు నత్తు, ముక్కెర, బొట్టు బహూకరణ : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు తిరుపతికి చెందిన నవీన్‌రెడ్డి బంగారు నత్తు, ముక్కెర, బొట్టు ఆదివారం బహూకరించారు. దేవస్థానం స్థానాచార్య శివప్రసాదశర్మకు వాటిని అందజేశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు వారికి ఆలయమర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి వేదాశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు ప్రసాదాలను అందజేశారు.

నూతన ఒరవడికి శ్రీకారం

■ దుర్గగుడిలో తొలిసారి స్టెయిర్ కేస్ లిఫ్ట్ ■ వృద్ధులు, దివ్యాంగులకు సులభంగా దర్శనం

చిట్టినగర్, న్యూస్‌టుడే

వృద్ధులు, దివ్యాంగులు అనారోగ్యంతో ఉన్న వారు, నడవలేని వారు కూడా సులభంగా జగన్మాత దుర్గమ్మ దర్శనం చేసుకునే సౌలభ్యాన్ని అధికారులు దసరా ఉత్సవాల్లో కల్పించారు. ఈ ఉత్సవాల్లో వారిని ఓం మలుపు వరకు వాహనాల్లో తీసుకొచ్చి దింపుతున్నారు. వాలంటీర్లు వారిని చక్రాల కుర్చీలో చిన రాజగోపురం వరకు తీసుకు వస్తారు. అక్కడ నుంచి అమ్మవారి సన్నిధికి చేరుకుని దర్శనం చేసుకోవాల్సి ఉంది. చిన రాజగోపురం నుంచి ఆలయానికి వెళ్లేందుకు 23 మెట్లు ఉన్నాయి. దివ్యాంగులు, వృద్ధులు, ఆరోగ్యం బాగోలేని వారు అవి దిగలేని పరిస్థితి ఉంది. కర్తవ్యంగా ఆ మెట్ల వద్దే 'స్టెయిర్ కేస్ లిఫ్ట్'ను ఏర్పాటు చేశారు. అక్కడ ఆలయ సెక్యూరిటీ సిబ్బంది లిఫ్ట్ కుర్చీలో కూర్చోబెట్టి రిమోట్‌తో మీట నొక్కుతారు. కుర్చీ నిదానంగా మెట్ల దిగువ వరకు తీసుకెళ్తుంది. అమ్మవారిని దర్శించుకుని మళ్లీ అక్కడికి వస్తే అదే లిఫ్ట్ కుర్చీలో కూర్చుంటే మెట్ల పై వరకు తీసుకెళ్తుంది. సుమారు రూ.8 లక్షలతో ఈ లిఫ్ట్‌ను తొలిసారి ఏర్పాటు చేశారు. దీనిని 20 నిమిషాలు ఛార్జింగ్ చేస్తే 5 సార్లు కిందికి, పైకి తిరుగుతుంది. ఎప్పటికప్పుడు అక్కడే దానికదే ఛార్జింగ్ చేసుకునే విధంగా అమర్చారు. ఛార్జింగ్ సమయంలో ఆగిపోతుంది. ఛార్జింగ్ పూర్తికాగానే మీట నొక్కితే మళ్లీ కదులుతుంది. ఈ లిఫ్ట్ కుర్చీ ఒక్కటే ఉంటుంది.


దివ్యాంగులు, వృద్ధులు వీల్‌చైర్లలో రాజగోపురం వరకు ఇలా..


మెట్లు దిగకుండా స్టెయిర్ కేస్ లిఫ్ట్ కుర్చీలో దర్శనానికి సులువుగా ఇలా..

మాకు వరం



నేను దివ్యాంగుడిని. విశాఖ జిల్లా భీమిలి నుంచి దుర్గమ్మ దర్శనానికి వచ్చాను. ఓం మలుపు నుంచి వాలంటీర్లు చక్రాల కుర్చీలో కూర్చొబెట్టి చిన రాజగోపురం వరకు తీసుకు వచ్చారు. అక్కడ మెట్లు దిగాల్సి ఉంది. స్టెయిర్ కేస్ లిఫ్ట్ కుర్చీపై కూర్చుంటే కాలు కదల కుండా మెట్ల కిందకు తీసుకెళ్లి దింపింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా హాయిగా దర్శనం చేసుకుని వచ్చాను. మళ్లీ మెట్లు ఎక్కకుండా అదే పైకి తీసుకొచ్చింది. అమ్మ దర్శనం చాలా గొప్పగా అయ్యింది. గతంలో మెట్లు దిగలేక ఆయాస పడ్డా. - కె.గాంధీ, దివ్యాంగుడు

కాలు కదపకుండా మెట్లు దిగా



నేను అనారోగ్యంతో బాధపడుతున్నాను. నడవలేని పరిస్థితి. ప్రతి ఏటా అమ్మవారి దర్శనానికి వస్తాను. ఈ ఏడాది కూడా జగన్మాత దర్శనం చేసుకోవాలనే సంకల్పంతో కొండపైకి వచ్చాను. వాలంటీర్లు వీల్ కుర్చీలో తీసుకెళ్లారు. చిన రాజగోపురం వద్ద గతంలో వలె కాకుండా ఈ కుర్చీ ఏర్పాటు చేశారు. అందులో కూర్చుంటే చక్కగా మెట్లు దింపింది. కొత్తగా మాలాంటి వారి కోసం ఈ లిఫ్ట్ ఏర్పాటు చేయడం చాలా బాగుంది. గతంలో వలె ఇబ్బందులు లేవు. - ఎస్.గంగమ్మ, భవానీపురం

ఉడా కాలనీలో పార్కు ప్రారంభం

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : స్థానిక 63వ డివిజన్, ఉడాకాలనీలోని పబ్లిక్ పార్కును ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పచ్చదనం, ప్రశాంతత, వినోదానికి పార్కులు కేంద్రం కావాలని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి, వ్యాయామం, ప్రకృతిని ఆస్వాదించడానికి ఇవే అనువైన ప్రదేశాలని తెలిపారు. ప్రజలు వాటిని శుభ్రంగా ఉంచుకుని.. పచ్చదనం పెంచాలని పిలుపునిచ్చారు.

'రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు'

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : రాజకీయ ఉనికి కోల్పోతున్న వామపక్ష పార్టీలు తమ లబ్ధి కోసం వరద బాధితుల సాయంపై విమర్శలు చేస్తున్నారని తెదేపా మాజీ ఫ్లోర్‌లీడర్ ఎరుబోతు రమణారావు విమర్శించారు. ఆదివారం ఆయన న్యూరాజరాజేశ్వరీపేటలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పరిహారం అందని బాధితులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పరిహారం ఇప్పిస్తామని బాధితులను కలెక్టర్ కార్యాలయం వద్దకు ఎందుకు తీసుకు వెళుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావును ప్రశ్నించారు. వార్డు/ సచివాలయాల్లో ప్రతి 100 కుటుంబాలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని.. వాటిని పరిశీలిస్తే ఎంత మందికి అందిందో తెలిసిపోతుందన్నారు. కొంత మంది వార్డు సచివాలయ ఉద్యోగులు ఇప్పటికీ వైకాపా ముసుగులోనే ఉన్నారని.. వారి వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని మండిపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో సరిగా ఎన్యూమరేషన్ చేయలేదని, దానివల్ల ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. త్వరలో వారికీ పరిహారం అందుతుందని తెలిపారు. సచివాలయాల వారీగా పరిహారం రానివారి వివరాలు కలెక్టర్‌కు పంపిస్తే.. పరిహారం ఇస్తామని సాక్షాత్తు మంత్రి నారాయణ చెప్పారని గుర్తు చేశారు. పది రోజులు బస్సులోనే ఉండి వరద బాధితులకు ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ అండర్-17 బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. గత అయిదు రోజులు జరిగిన శిక్షణ శిబిరంలో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు పాల్గొన్నారని ఎన్టీఆర్, కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు సంయుక్తంగా తెలిపారు. జట్టు సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి.


జట్టు: పి.పెదబాబు, జి.రాము, డి.వెంకటరమణ, సయ్యద్ సాబాద్, షేక్ అబ్దుల్ రఫీక్, జె.తారకేష్, ఎల్.జశ్వంత్(కేబీసీ జడ్పీహెచ్ స్కూల్, పటమట), ఎం.సుమంత్, వి.సిద్ధు, బి.అభినవ్, ఎం.నవీన్‌కుమార్, డి.హర్షవర్ధన్ (జడ్పీహెచ్ స్కూల్, కొండపల్లి), ఎం.అభిషేక్, కె.అభిలాష్(సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కృష్ణారావుపాలెం), ఎండీ తన్విత్ (నిర్మల హై స్కూల్, పటమట). ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా ఎల్.దుర్గారావు (ఎస్ఏపీఈ, కేబీసీ జడ్పీహెచ్ స్కూల్, పటమట) వ్యవహరిస్తారు.


ఎంపికైన జిల్లా జట్టు సభ్యులతో కోచ్ దుర్గారావు

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌లో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన స్కూల్ గేమ్స్ సమాఖ్య(ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి అండర్-19 సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా బాలికల జట్టు రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో ఆతిథ్య పశ్చిమ గోదావరి జట్టుతో తలపడి 0-1 పరుగు తేడాతో ఓటమిపాలైందని జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వేమూరి రవికాంత తెలిపారు. జిల్లా బాలుర జట్టు చతుర్థ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ ఛాంపియన్‌షిప్ నుంచి బాలికల విభాగంలో కె.సంధ్య, టి.దివ్య, కె.స్మైలీ, బాలుర విభాగంలో డి.కృష్ణలు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరంతా డిసెంబరులో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తలపడే రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ట్రోఫీ సాధించిన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, పలువురు పీడీలు అభినందించారు.


అతిథుల నుంచి రన్నరప్ ట్రోఫీ అందుకున్న జిల్లా బాలికల జట్టు సారథి, జట్టు సభ్యులు, కోచ్, మేనేజర్లు


బెజ్జాలమేడ వీధిలో కొలువైన లలితా త్రిపురసుందరీదేవి అమ్మవారు


పాలఫ్యాక్టరీ వద్ద ఆలయంలో..


దాసాంజనేయ ఆలయంలో అమ్మవారు


చిట్టినగర్‌లో అన్నపూర్ణాదేవిగా


వీఎంసీ కాలనీలో..


అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్


కళావేదికపై నృత్య ప్రదర్శనలో కళాకారిణులు


అన్నపూర్ణాదేవి అలంకారంలో భ్రమరాంబదేవి

లలితాత్రిపుర సుందరీ పాహిమాం


ఆకట్టుకున్న నృత్య రూపకం

చిట్టినగర్, న్యూస్‌టుడే : దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలు పలు ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తరిస్తున్నారు. పాలఫ్యాక్టరీ వద్ద ఉన్న విజయదుర్గ, వీఎంసీ కాలనీలోని కనకదుర్గమ్మ, కొత్తపేటలోని గంగానమ్మ, కేబీఎన్ కాశాల ప్రాంగణంలోని దాసాంజనేయ స్వామి వారి ఆలయాల్లో అమ్మవార్లు శ్రీ లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. బెజ్జాలమేడవీధిలో శ్రీపద్మనాభ వీఎల్‌సీసీఎస్ కంపెనీ నిర్వాహకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, 50వ డివిజన్ అబ్దుల్ ఖాదర్‌వీధిలో శ్రీశాంభవీ మాత సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక సెట్టింగ్ వేసి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం లలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. చిట్టినగర్‌లోని నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం అన్నపూర్ణాదేవిగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


శ్రీశాంభవీమాతగా భక్తులకు దర్శనం

నవరాత్రుల్లో ఆధ్యాత్మిక సంబరం

విద్యాధరపురం, న్యూస్‌టుడే : దసరా వేడుకల్లో భాగంగా ఆదివారం పాతబస్తీలో ఆధ్యాత్మిక సంబరం నెలకొంది. పాతబస్తీలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద సంఖ్యలో కుంకుమ పూజలో పాల్గొన్నారు. ప్రధానార్చకుడు సుమంత్ శర్మ పర్యవేక్షణలో చండీ హోమం నిర్వహించారు.

❖ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తుమ్మపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం సమీపంలో వీరబాబు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని కన్యకా పరమేశ్వరిదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయం వారు ఏర్పాటు చేసిన అన్నప్రసాద పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బసవ రాజు, రామ్మోహనరావు పాల్గొన్నారు. ❖ కనకదుర్గానగర్‌లోని కళావేదికపై ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సువర్ణకుమారి, పల్లవి, సంకీర్తన, లేఖశ్రీల భక్తి రంజని, లలినాగరాణి సంగీత వీభావరి భక్తులను అలరించాయి. తన్మయ, తరుణి, మానస, శ్రీలక్ష్మిల నృత్య ప్రదర్శన ఔరా అనిపించింది.

రైతుబజారులో చరవాణి దొంగలు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం రైతుబజారులో వినియోగదారుల చరవాణీలు దొంగతనానికి గురయ్యాయి. రైతుబజారుకు ఆదివారం ఉదయం వినియోగదారులు పెద్ద సంఖ్యలో రావడంతో రద్దీగా మారింది. దీంతో దొంగలు ఫోన్లు దొంగతనం చేశారు. గతంలో కూడా పలువురి చరవాణీలు మాయం అయ్యాయి. బాధితులు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం నేడు

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా పి.ఎస్. మునిరత్నం సోమవారం ఉదయం ఆర్టీసీ హౌస్‌లోని కార్యాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం చేస్తారని ప్రజా సంబంధాల అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తారని చెప్పారు.

13 దర్గా కమిటీ సమావేశం

భవానీపురం, న్యూస్‌టుడే : హజరత్ గాలిబ్ షహీద్ దర్గా నూతన అధ్యక్షుడి నియామకానికి ఈ నెల 13వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు దర్గా ముజావర్లు తెలిపారు. ప్రస్తుతం దర్గా అధ్యక్షుడిగా ఉన్న ముస్తాక్ అహ్మద్ కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

ఏడుగురి అరెస్టు

పెదకాకాని, న్యూస్‌టుడే: యువతకు గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని నంబూరుకు చెందిన ప్రైవేటు ఉద్యోగి వాసా రాజేష్, ట్రాక్టర్ డ్రైవర్ తాడిబోయిన గోపి కృష్ణ, కూల్‌డ్రింక్ దుకాణం నిర్వాహకుడు దుర్గపు పవన్‌కుమార్ స్నేహితులు. ఈ ముగ్గురు జల్సాలకు అలవాటు పడి గంజాయి తెప్పించి విక్రయిస్తున్నారు. వీరికి గంజాయి వ్యాపారం చేసే అనగాని రాఘవేంద్ర (కృష్ణా జిల్లా ఉయ్యూరు), తాతా హేమంత్ (ఏలూరు జిల్లా నూజివీడు), విజయవాడ పడమటకు చెందిన పండాలనేని వెంకట శివ గణేశ్‌కుమార్, ప్రతివాడ శివాజీ తోడయ్యారు. ఈ నెల 5వ తేదీ రాత్రి ఈ నలుగురు గంజాయి తీసుకొచ్చి నంబూరులోని ఓ కాలనీ వద్ద ఉన్న రాజేష్, గోపి కృష్ణ, పవన్‌కుమార్‌లకు ఇచ్చారు. అందరూ కలిసి గంజాయిని చిన్న పొట్లాలుగా ప్యాకింగ్ చేస్తున్నారు. అదే సమయంలో పెదకాకాని సీఐ నారాయణస్వామి, కానిస్టేబుళ్లు దాడి చేసి ఈ ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు కేజీల గంజాయి (విలువ రూ.60వేలు), మూడు ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ కృష్ణకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితులను ఆదివారం రిమాండ్‌కి పంపినట్లు సీఐ తెలిపారు.

పాలకుల వైఫల్యంతోనే వరద కష్టాలు : సీపీఎం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రకృతి వైపరీత్యంతో పాటు గత, నేటి పాలకుల వైఫల్యమే వరద కష్టాలకు కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 35 రోజులు గడిచినా ఇంకా వేలాది మందికి వరద సాయం అందలేదని విమర్శించారు. తిరుపతి లడ్డూపై పెట్టిన శ్రద్ధ.. బాధితులను ఆదుకోవడంలో పెట్టాలని హితవు పలికారు. ఆదివారం ఆయన గవర్నర్‌పేటలోని శ్రీశ్రీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వరదలతో 11.5లక్షల మంది ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఈ విపత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత, గత పాలకుల వైఫల్యమూ ఉందన్నారు. చివరి బాధితుడికీ పరిహారం ఇస్తామని సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. పేదల పునరావాస కాలనీలు ముంపునకు గురయ్యాయని గుర్తు చేశారు. కేంద్ర సాయం అంశంపై తెదేపా, జనసేన, వైకాపాలు మాట్లాడడం లేదని విమర్శించారు. దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఇంటిని తిరిగి ఎన్యుమరేషన్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు రూ.534 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయని.. కానీ దిగువ స్థాయిలో బాధితులకు పూర్తిగా సాయం అందలేదని వివరించారు. న్యాయం చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని దుయ్యబట్టారు. ఓట్లకు అర్హులైన వారు నష్టపరిహారానికి ఎందుకు అర్హులు కారని ప్రశ్నించారు. నష్టపరిహారం రూ.50వేలకు పెంచాలని బాబూరావు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.లక్ష జరిమానా

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించిన కృష్ణలంకలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యానికి రూ.లక్ష జరిమానా విధించినట్టు డీఈవో యూవీ సుబ్బారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం అక్కడ తరగతులు నిర్వహిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు విద్యాశాఖాధికారులు పాఠశాలను పరిశీలించగా.. నిజమేనని తేలిందని పేర్కొన్నారు. సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పోలీసు అదుపులో 13 మంది జూదరులు

రూ.1,14,210ల స్వాధీనం

చిట్టినగర్, న్యూస్‌టుడే : వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన జూదరులను కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,14,210ల స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం వైఎస్‌ఆర్ కాలనీ వెనుక భాగంలోని రైల్వే ట్రాక్ సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. శిబిరంపై దాడి చేసిన పోలీసులు 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ముఖ్యమంత్రి దృష్టికి బీసీల సమస్యలు

గాంధీనగర్, న్యూస్‌టుడే : నగరంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని బీసీ ఐక్యవేదిక నగర అధ్యక్షుడిగా నియమితులైన వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత అధికారి, ఏపీ ఎన్జీవో మాజీ నేత పి.వి.ఎల్.ఎన్.రాజు తెలిపారు. ఆదివారం చాంద్ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో సంఘం నాయకులు.. నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యవేదిక కమిటీలో వెనుకబడిన తరగతులకు చెందిన అన్ని కులాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. నగరంలో సంఘీయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. అధ్యక్ష పదవి అప్పగించినందుకు ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు కె.చాంద్, అధ్యక్షుడు బుద్దా నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బొమ్మిన రవికుమార్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాయిన శేఖర్‌బాబు, వెనిగళ్ల నాగదుర్గారావు, షేక్ బాజి, డాక్టర్ ధన్వంతరి, కె.వీర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన చాంద్, నాగేశ్వరరావు, రాజు, రవికుమార్ తదితరులు

కుటుంబ కలహాలతో ఇద్దరి బలవన్మరణం

కొండపల్లి, న్యూస్‌టుడే: కుటుంబ వ్యవహారాల్లో నెలకొన్న సమస్యలకు తాళలేక ఇరువురు బలవన్మరణం చెందిన సంఘటనలు కొండపల్లిలో వేర్వేరు చోట్ల ఆదివారం చోటుచేసుకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శాలివాహన బజార్‌లో నివసించే అశోక్(35) ఓ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతడికి కంచికచర్లకు చెందిన రమణతో ఆరేళ్ల కిందట వివాహమవగా..ఓ పాప సంతానం. కొంత కాలంగా భార్య భర్తల మధ్య వివాదాలు నెలకొని ఎవరికి వారు పుట్టిళ్లలో ఉంటున్నారు. ఆదివారం ఉదయం అశోక్ తన తల్లిదండ్రులతో భార్య, పాప గురించి మాట్లాడాడు. కొంత సేపటికి గదిలోకి వెళ్లిపోయాడు. నిద్రపోతున్నాడనుకున్న తల్లిదండ్రులు మధ్యాహ్నానికి చూసే సరికి ఉరివేసుకొని కనిపించడంతో బోరుమన్నారు. ఇదిలా ఉంటే మరో సంఘటనలో యాదవుల బజార్‌లో నివాసముండే ఈశ్వరి(30)కి ఏడాది కిందట విజయవాడకు చెందిన యువకుడితో వివాహమైంది. కొన్ని నెలలుగా భార్య భర్తల మధ్య వివాదం నెలకొనగా ప్రస్తుతం పుట్టింట్లోనే ఉంటోంది. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు ఓ శుభకార్యానికి వెళ్లగా ఒంటరిగా ఉన్న ఈశ్వరి కొంతసేపటికి వాళ్లకు ఫోన్ చేసి వస్తున్నారా అని అడిగింది. సాయంత్రం వారు ఇంటికి వచ్చే సమయానికి ఇంట్లో ఉరివేసుకొని ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

విజయవాడ మధ్య

యూజీడీకి మరమ్మతులు

స్పందనకు వందనం

మాచవరం : మాచవరం దాసాంజనేయ స్వామి గుడి నుంచి ఎస్సారార్ కళాశాల సెంటర్‌కు వచ్చే ఏలూరు రోడ్డులో యూజీడీ ధ్వంసమైంది. ప్రమాదకరంగా మారింది. 'న్యూస్‌టుడే' సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. యూజీడీ విభాగం అధికారులు స్పందించి.. మరమ్మతులు చేశారు. వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు.



మురుగు లీకేజీకి అడ్డుకట్ట

ఈనాడు కథనానికి స్పందన

కస్తూరిబాయిపేట (సీతారాంపురం): పుష్పా హోటల్ నుంచి మహాత్మాగాంధీ రోడ్డుకు వెళ్లే వేముల శ్యామలాదేవి రోడ్డులో మురుగుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'మురుగు.. రోడ్డుపైనే పరుగు' శీర్షికతో ఈ నెల 6వ తేదీన 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. వీఎంసీ అధికారులు స్పందించి.. ఆదివారం యూజీడీని శుభ్రం చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



వేముల శ్యామలాదేవి రోడ్డులో శుభ్రం చేసిన యూజీడీ

నిరుపేదలకు చేయూత

సీతారాంపురం, న్యూస్‌టుడే : స్థానిక ఐనవోలువారి వీధిలోని మహంతి అప్పలనర్సయ్య మహాలక్ష్మి (ఎంఏఎం)ఛారిటబుల్ ట్రస్టు నిరుపేదల ఉపాధికి చేయూతనిచ్చింది. చుట్టుగుంట, ఆరో డివిజన్‌లో నివసించే లక్ష్మి, రామారావు దంపతులు కూరగాయలు అమ్ముకొని జీవనం సాగించేలా నాలుగు చక్రాల తోపుడు బండిని సమకూర్చారు. దీనిని ట్రస్టు ఛైర్మన్ మహంతి వాసుదేవరావు అందజేశారు.

ఉడాకాలనీలో పార్కు ప్రారంభం

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : స్థానిక 63వ డివిజన్, ఉడాకాలనీలోని వట్టే రాజ్‌కుమార్ పార్కును ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పచ్చదనం, ప్రశాంతత, వినోదాలకు పార్కులు కేంద్రం కావాలని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి, వ్యాయామం, ప్రకృతిని ఆస్వాదించడానికి ఇవే అనువైన ప్రదేశాలని తెలిపారు. ప్రజలు వాటిని శుభ్రంగా ఉంచుకుని.. పచ్చదనం పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నవనీతం సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు లబ్బ వైకుంఠం, లబ్బ దుర్గా, బత్తుల కొండ, కోలా శ్రీను, వట్టే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నగరం సుభిక్షంగా ఉండాలి

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : నగరం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చెప్పారు. ఆదివారం సత్యనారాయణపురంలోని దుర్గాభవాని సమేత నీలకంఠేశ్వరపీఠంలోని అమ్మవారిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. నిర్వాహకులు ఆయన్ని సత్కరించారు. కమలాకర్, జగదాంబ, అవినాష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం ఆటవిడుపు



గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమం నిర్వహించారు. 'చదవడం మాకిష్టం' పేరుతో విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షకురాలు జ్యోత్స్న.. పిల్లలతో సాధన చేయించారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విధి విలయం.. వీధి విలాపం..

- ✦ వివరాలు తప్పుగా నమోదు
- ✦ పరిహారం రాక బాధితుల వేదన

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే

పాయకాపురం ప్రకాశ్‌నగర్‌లో గోసుల గంగులు వీధి ఉంది. దాదాపు 50 ఇళ్లు ఉంటాయి. బుడమేరుకు వరద వచ్చినపుడు ఆరు అడుగుల మేర వరద నీరు చేరింది. గ్రౌండ్ ఫ్లోర్లు మునిగిపోయాయి. వారం రోజులు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత చూస్తే... ఇళ్లల్లోని వస్తువులన్నీ పూర్తిగా పాడైపోయాయి. అందరూ కట్టుబట్టలతో మిగిలిన వారే. కొంత మందికి వరద సాయం కింద ఒక్క పైసా రాలేదు. రికార్డుల్లో తమ వివరాలు తప్పుగా నమోదు చేయడమే దీనికి కారణమని బాధితులు వాపోతున్నారు. కొందరు కిందే నివాసం ఉంటే.. మొదటి అంతస్తులో ఉన్నట్లు నమోదైంది. అలాగని వారికి రూ.10వేలైనా పడ్డాయా అంటే.. కనీసం ఒక్క రూపాయి రాలేదు. సచివాలయం వద్దకు వెళ్లి ఉద్యోగులను అడిగితే.. సరైన సమాధానమే చెప్పడం లేదని, పైగా విసుక్కుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా.. ఫలితం సున్నా అని కన్నీటిపర్యంత మవుతున్నారు.




గోసులు గంగులు వీధి

కలెక్టర్ కార్యాలయానికి రెండు సార్లు వెళ్లా



మేం గ్రౌండ్ ఫ్లోర్ ఉంటాం. కానీ మొదటి అంతస్తులో ఉన్నట్లుగా నమోదు చేశారు. పరిహారం అందలేదు. కొడుకు మొదటి అంతస్తులో ఉన్నారు. ఆటో, కుట్టుమిషన్‌తో పాటు అన్నీ పాడైపోయాయి. పరిహారం ఇప్పటి వరకు పడలేదు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లాం. రెండుసార్లు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు డబ్బులు పడలేదు. సరైన సమాధానమే ఇవ్వడం లేదు. **- బోను వెంకయమ్మ**

రూ.10వేలు పడలేదు



నేను ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నా. భార్యతో కలిసి.. డాబా మొదటి అంతస్తులో ఉంటాను. వరద తర్వాత పేర్లు నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఒక్క పైసా ఇవ్వలేదు. అడిగితే.. జాబితాలో పేరు వచ్చిందని.. డబ్బులు 4, 5 రోజుల్లో వస్తుందంటున్నారు. కానీ ఇప్పటి వరకు రాలేదు. ఇప్పటికైనా పరిహారం వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాం. **- కె.దుర్గారెడ్డి**

సాయం అవసరం



గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటా. వరదల్లో ఇంట్లోకి నీరు వచ్చి సామానంతా పాడైపోయింది. 2 సంవత్సరాలుగా అదే ఇంట్లో అద్దెకు ఉంటున్నాను. సాయం పడుతుందని ఎదురు చూస్తుంటే.. ఇప్పటి వరకు ఖాతాల్లో పడలేదు. సచివాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు ఇచ్చినా.. సాయం రాలేదు. డబ్బులు ఇస్తే వస్తువులు కొనుక్కుంటాను. **- జి.సౌభాగ్యం**

షాపు, ఇల్లు పాడైపోయాయి



నేను కుండలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నా. వరదల్లో 80 కుండలు కొట్టుకుపోయాయి. సామానంతా నీటిలో నానిపోయాయి. కుట్టు మిషన్లు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. ఈ వివరాలు నమోదు చేసుకోలేదు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్నా.. ఇప్పటి వరకు పరిహారం రాలేదు. **- శివపార్వతి**

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



నేను ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. ఉండేది గ్రౌండ్ ఫ్లోర్‌లో అయితే ఫస్ట్ ఫ్లోర్ అని వచ్చింది. ఆటో పాడైపోతే రూ.10వేలు పరిహారం ఇచ్చారు. ఇంటికి పరిహారం రాలేదు. మొదటి అంతస్తు అని వచ్చిందని.. సచివాలయంలో ఫిర్యాదు చేస్తే పట్టించుకోవటం లేదు. విసుక్కుంటున్నారు. ఎమ్మెల్యే బొండా ఉమా చెబితే.. మరోసారి వివరాలు చూశారు. మొదటి అంతస్తే అని వస్తోంది. మొదట్లో తప్పుగా నమోదు చేయటంతో ఈ పరిస్థితి వచ్చింది. **- పి.రవిరామ్**

పాలకుల వైఫల్యంతోనే వరద కష్టాలు : సీపీఎం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రకృతి వైపరీత్యంతో పాటు గత, నేటి పాలకుల వైఫల్యమే వరద కష్టాలకు కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 35 రోజులు గడిచినా ఇంకా వేలాది మందికి వరద సాయం అందలేదని విమర్శించారు. తిరుపతి లడ్డూపై పెట్టిన శ్రద్ధ.. బాధితులను ఆదుకోవడంలో పెట్టాలని హితవు పలికారు. ఆదివారం ఆయన గవర్నర్‌పేటలోని శ్రీశ్రీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వరదలతో 11.5లక్షల మంది ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఈ విపత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత, గత పాలకుల వైఫల్యమూ ఉందన్నారు. చివరి బాధితుడికీ పరిహారం ఇస్తామని సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. పేదల పునరావాస కాలనీలు ముంపునకు గురయ్యాయని గుర్తు చేశారు. కేంద్ర సాయం అంశంపై తెదేపా, జనసేన, వైకాపాలు మాట్లాడడం లేదని విమర్శించారు. దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఇంటిని తిరిగి ఎన్యుమరేషన్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు రూ.534 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయని.. కానీ దిగువ స్థాయిలో బాధితులకు పూర్తిగా సాయం అందలేదని వివరించారు. న్యాయం చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని దుయ్యబట్టారు. ఓట్లకు అర్హులైన వారు నష్టపరిహారానికి ఎందుకు అర్హులు కారని ప్రశ్నించారు. నష్టపరిహారం రూ.50వేలకు పెంచాలని బాబూరావు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.



నష్టం వివరాలు చూపిస్తున్న కాశీనాథ్, బాబూరావు

రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు : తెదేపా

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : రాజకీయ ఉనికి కోల్పోతున్న వామపక్ష పార్టీలు తమ లబ్ధి కోసం వరద బాధితుల సాయంపై విమర్శలు చేస్తున్నారని తెదేపా మాజీ ఫ్లోర్ లీడర్ ఎరుబోతు రమణారావు విమర్శించారు. ఆదివారం ఆయన న్యూరాజరాజేశ్వరీపేటలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పరిహారం అందని బాధితులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పరిహారం ఇప్పిస్తామంటూ బాధితులను కలెక్టర్ కార్యాలయం వద్దకు ఎందుకు తీసుకు వెళుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావును ప్రశ్నించారు. వార్డు/ సచివాలయాల్లో ప్రతి 100 కుటుంబాలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని.. వాటిని పరిశీలిస్తే ఎంత మందికి రాలేదో తెలిసిపోతుందన్నారు. కొంత మంది వార్డు సచివాలయ ఉద్యోగులు ఇప్పటికీ వైకాపా ముసుగులోనే ఉన్నారని.. వారి వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని మండిపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో సరిగా ఎన్యుమరేషన్ చేయలేదని, దానివల్ల ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. వాటిని గుర్తించి సరిచేస్తున్నామని.. త్వరలో వారికీ పరిహారం అందుతుందని తెలిపారు. సచివాలయాల వారీగా పరిహారం రానివారి వివరాలు కలెక్టర్‌కు పంపిస్తే.. పరిహారం ఇస్తామని సాక్షాత్తు మంత్రి నారాయణ చెప్పారని గుర్తు చేశారు. పది రోజులు బస్సులోనే ఉండి వరద బాధితులకు ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు.



మాట్లాడుతున్న ఎరుబోతు రమణారావు

నిత్యావసరాల పంపిణీ

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : న్యూరాజీవ్‌నగర్ మాస్టర్ మైండ్స్ స్కూలులో ఆదివారం వరద బాధితులు 1500 మందికి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఎస్‌బీఐ కార్డ్, రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని బియ్యం, కందిపప్పు, నూనె, పంచదార ఇతర నిత్యావసరాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వరద బాధిత ప్రజలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావటం అభినందనీయమని కొనియాడారు. ఈ ప్రాంతం త్వరలో సాధారణ స్థితికి వస్తుందని పేర్కొన్నారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.



సరకులు అందిస్తున్న ఉమామహేశ్వరరావు, ప్రతినిధులు

అమ్మ అనుగ్రహం.. మాంగల్య భాగ్యం!



దావుబుచ్చయ్య కాలనీలోని శ్యామలాంబదేవి ఆలయంలో..



పాయకాపురం సుందరయ్యనగర్‌లో...



మధురానగర్ వి.వి.నరసరాజు రోడ్డులో..



కస్తూరిబాయిపేటలోని ముత్యాలమ్మ గుడిలో..



మధురానగర్ నేతాజీ రోడ్డులో..



మధురానగర్ పైవంతెన వద్ద..

మధురానగర్, గాంధీనగర్, సీతారాంపురం : దసరా ఉత్సవాలు నాలుగో రోజున దుర్గమ్మ లలిత త్రిపుర సుందరీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. చేతిలో చెరుకుగడ, ప్రశాంతమైన చిరునవ్వుతో.. భక్తుల పూజలు అందుకున్నారు. దేవాలయాలు, ప్రత్యేక వేదికలపై మండపాలు కిటకిటలాడారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. గవర్నర్‌పేటలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణదేవస్థానంలో దుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. జింఖానా మైదానం సమీపంలోని అనుగ్రహ దుర్గాదేవి ఆలయంలో లలితా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సత్యనారాయణపురం : సత్యనారాయణపురంలోని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అయోధ్యనగర్‌లోని శివకామేశ్వరి అమ్మవారిని ధాన్యలక్ష్మిగా తీర్చిద్దారు. రైతన్నలు క్షేమంగా ఉండాలని.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ధర్మపరిషత్ సంస్థానం వ్యవస్థాపకులు హేమ సుందర వరప్రసాద్ తెలిపారు. ముత్యాలంపాడులో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. కుంకుమ పూజలు కొనసాగాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో, దుర్గాపురంలో 28వ డివిజన్ తెదేపా కార్పొరేటర్ వీరమాచనేని లలిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అమ్మవారిని, దుర్గాభవాని సమేత నీలకంఠేశ్వర పీఠంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.



జింఖానా మైదానం సమీప అనుగ్రహ దుర్గాదేవి ఆలయంలో..



ముత్యాలంపాడులో కుంకుమ పూజలు



అయోధ్యనగర్‌లో ధాన్యలక్ష్మిగా..



కార్మికపురంలో..



దుర్గాపురంలో..

ముఖ్యమంత్రి దృష్టికి బీసీల సమస్యలు



సమావేశమైన చాంద్, నాగేశ్వరరావు, రాజు, రవికుమార్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : నగరంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని బీసీ ఐక్యవేదిక నగర అధ్యక్షుడిగా నియమితులైన వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత అధికారి, ఏపీ ఎన్జీవో మాజీ నేత పి.వి.ఎల్.ఎన్.రాజు తెలిపారు. ఆదివారం చాంద్ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో సంఘం నాయకులు.. నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యవేదిక కమిటీలో వెనుకబడిన తరగతులకు చెందిన అన్ని కులాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. నగరంలో సంఘీయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. అధ్యక్ష పదవి అప్పగించినందుకు ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు కె.చాంద్, అధ్యక్షుడు బుద్ధా నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బొమ్మిన రవికుమార్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాయిన శేఖర్‌బాబు, వెనిగళ్ల నాగదుర్గారావు, షేక్ బాజి, డాక్టర్ ధన్వంతరి, కె.వీర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుమస్తాలకు ఆదరువు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : బుడమేరు వరదల్లో నష్టపోయిన న్యాయవాదుల గుమస్తాలను ఆదుకునేందుకు ఫ్లాష్, రాధారంగ మిత్రమండలి ముందుకు వచ్చింది. న్యాయవాది యర్రంశెట్టి శ్రీనివాసరావు సౌజన్యంతో బీబీఏ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం చేతుల మీదుగా పరుపులు, దిండ్లు, దుప్పట్లు, గడియారాలు, నిత్యావసరాల కిట్లు అందించారు. న్యాయస్థానాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పడవల ఏడుకొండలు, పీడీఎస్ నారాయణ, మల్లి, కిరణ్, వెంకటేశ్వర్లు, పేడూరి సాయిబాబు, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పరుపు అందిస్తున్న గురునాథం

కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ

పాయకాపురం (మధురానగర్): ప్రకాశ్‌నగర్, ఎస్సీకాలనీలో ఆదివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కుల వివక్షతకు వ్యతిరేకంగా ప్రతిఘటనా పోరాటాలు జరగాలని కోరారు. రాజ్యాంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారతదేశంలోనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తోటి మనిషిని మనిషిగా చూడలేని పరిస్థితులు నెలకొనడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి జి.నటరాజ్, సహాయ కార్యదర్శి చింతల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జి.అరుణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి. పక్కన నాగరాజు, శ్రీనివాస్, అరుణ

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : దుర్గాపురం వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. తెదేపా నగర నాయకులు వీరమాచనేని కిశోర్, రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, కొల్లూరి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షుడిగా షేక్‌బాబు, ఉపాధ్యక్షుడిగా డి.ఆంజనేయప్రసాద్, కార్యదర్శిగా ఎన్.సత్యనారాయణ, కోశాధికారిగా ఎం.వి.కృష్ణారావులు ఎన్నికయ్యారు. వీరితోపాటు మరో 10 మంది సభ్యుల్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గాంధీ, అనిల్ పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్టులో సభ్యత్వం

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : బీఆర్‌టీఎస్ రోడ్డు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, దుర్గాపురం వాకర్స్ క్లబ్ జీవితకాల సభ్యుడైన బ్రహ్మదేశం వసంతకుమార్‌కు.. వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్టు సభ్యత్వం లభించింది. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను ట్రస్టు గుర్తించి, సభ్యత్వం ఇచ్చినట్లు బీఆర్‌టీఎస్ రోడ్డు వాకర్స్ క్లబ్ కార్యదర్శి కొండాయిగుంట రాము తెలిపారు.

ఆత్మహత్యాయత్నం ఘటనలో కుమారుడి మృతి

మధురానగర్, న్యూస్‌టుడే : వివిధ రకాల సమస్యలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో కుమారుడు మృతిచెందారు. కృష్ణలంకకు చెందిన బొర్రా ప్రసాద్.. గుణదల ఊర్మిళానగర్‌లో ఉంటున్నారు. అతని కుమారుడు శివకుమార్ (32) అనారోగ్యంతో మంచంలోనే ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవనం కష్టంగా మారడంతో శుక్రవారం రాత్రి ప్రసాద్.. తాను పురుగుల మందు తాగి, కుమారుడికి తాగించారు. ఈ ఘటనలో ప్రసాద్ చనిపోయిన విషయం తెలిసిందే. కొన ఊపిరితో ఉన్న శివకుమార్‌ను ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

అష్టలక్ష్ములు.. ఆరాధ్య దేవతలు

కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక ప్రాధాన్యం


ఆదిలక్ష్మిని అర్చించడం ద్వారా భక్తుడికి మహాలక్ష్మి అనుగ్రహం లభిస్తుంది


సంతాన లక్ష్మి ద్వారా యోగ్యవంతులైన సంతానం కలుగుతుంది


గజలక్ష్మి అనుగ్రహంతో ప్రశాంతత చేకూరుతుంది


ధాన్యలక్ష్మి అనుగ్రహంతో సకల జీవరాశికి ఆహారం లభ్యమవుతుంది

ఇంద్రకీలాద్రిపై స్వయంభువుగా వెలిసిన కనకదుర్గమ్మ ఆలయ చరిత్ర కృతయుగం నాటిది. త్రేతా యుగంలో శ్రీరామచంద్రుడు, ద్వాపర యుగంలో అర్జునుడు అమ్మవారిని కొలిచినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. శ్రీకృష్ణదేవరాయులు పరిపాలనా కాలంలో ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు కొన్ని రాతి శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. అనంతర కాలంలో ప్రస్తుత ఆలయాన్ని గ్రానైట్‌తో పటిష్ఠంగా నిర్మించారు. పల్లవుల శిల్ప రీతిలో చిత్రవాణం, అధిష్ఠానం, స్తంభ వర్గం, కుడ్యకోష్ఠం, ప్రస్తరం, కర్ణకూటం, ప్రస్తార వేదిక, కంఠం, శిఖరం, కలశాలను ఏర్పాటు చేశారు.

కుడ్య కోష్ఠంలో అష్టలక్ష్ములు ప్రత్యేక ఆకర్షణ.. మహా కాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి అంశలతో ఏర్పాడిన రూపం జగన్మాత దుర్గమ్మ. దుర్గమ్మ ప్రధాన ఆలయ కుడ్య కోష్ఠంలో అష్టలక్ష్ములు ప్రత్యేక ఆకర్షణ. దుర్గమ్మ ప్రధాన ఆలయం చుట్టూ గోడలో వరుసగా ఆది లక్ష్మి, సంతాన లక్ష్మి, గజలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, విజయలక్ష్మి, ఐశ్వర్యలక్ష్మి, వీరలక్ష్మి విగ్రహాలను ఏర్పాటు చేశారు. 1999 ఏప్రిల్ 19 నుంచి 22 వరకు తయారీంకంగా నాటి కంచి కామకోటి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతి సువర్ణ శిఖరాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. గతంలో ఆదిలక్ష్మికి ప్రదక్షిణ చేసిన తరువాత దుర్గమ్మను దర్శించుకునేవారు. ప్రస్తుతం భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో అష్టలక్ష్ములను దర్శించుకునే అవకాశం లేకుండా పోయింది. అర్చకులు మాత్రం జగన్మాత దుర్గమ్మతోపాటు అష్టలక్ష్ములకు నిత్యం పూజ చేసి నివేదన సమర్పిస్తున్నారు. - ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే


ధనలక్ష్మిని పూజిస్తే మానవులకు అవసరమైన ధనానికి లోటు ఉండదు.


విజయలక్ష్మిని పూజిస్తే ఆమె చల్లని చూపుతో సకల కార్యాల్లో సాధకులకు విజయం సిద్ధిస్తుంది


ఐశ్వర్య లక్ష్మి అనుగ్రహంతో అష్టైశ్వర్యాలు లభిస్తాయి.


వీరలక్ష్మి(ధైర్యం) మనతో ఉంటే ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తి లభిస్తుంది. తద్వారా మిగతా లక్ష్ములు కూడా అండగా నిలుస్తారని దేవస్థానం పురాణ పండిట్ వెంకటేశ్వర శర్మ తెలిపారు.

విశిష్టం.. ఉపాలయాల దర్శనం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. అయితే ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయంతోపాటు మరికొన్ని ఉపాలయాలు సైతం ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకొని పూజలు చేస్తే చేపట్టిన విజయవంతం అవుతాయని భక్తుల విశ్వాసం. ఇంద్రకీలాద్రిపై ఉపాలయాలైన మల్లేశ్వరాలయం, నటరాజస్వామి ఆలయం, క్షేత్రపాలక ఆంజనేయస్వామి ఆలయాలకు విశిష్ట ఆదరణ ఉంది. ప్రాచీన కాలంలో మల్లేశ్వరాలయాన్ని నిర్మించారు. మల్లేశ్వరాలయంలో క్షేత్రపాలకుడు కాలభైరవుడు, నందీశ్వరుడి దర్శనం తరువాత స్వామి వారిని దర్శించుకుంటారు.

మల్లేశ్వరాలయం

కృత యుగంలో చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు ఇక్కడ స్వామి వారిని మల్లికా పుష్పాలతో పూజించడంతో మల్లేశ్వరుడు అని పేరు వచ్చినట్లు పండితులు చెబుతున్నారు. దాతల సహకారంతో 2017 నుంచి ఆలయ పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. దాత సంకా నరసింహారావు రూ.5కోట్ల వ్యయంతో మల్లేశ్వరాలయాన్ని 200 మీటర్లు విస్తరణకు సహకరించారు. దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయాన్ని సందర్శించి కనకదుర్గానగర్ వెళ్లేందుకు విశాలమైన మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేశారు. గడ్డర్లతో మల్లేశ్వరాలయాన్ని విస్తరించారు. తరువాత రూ. 6కోట్ల వ్యయంతో దేవస్థానం మల్లేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు చేసింది. ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయడంతోపాటు ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు మల్లేశ్వర స్వామిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు.



నాట్యకళా కేంద్రంగా నటరాజస్వామి ఆలయం



ఇంద్రకీలాద్రిపై వినాయక నటరాజ శివకామ సుందరీదేవి ఆలయానికి ప్రత్యేకత ఉంది. చక్కటి శిల్పకళా నైపుణ్యంతో కూడిన మండపంతో ఈ కోవెలను తీర్చిదిద్దారు.

మొదటి ఆలయంలో వినాయకుడు, రెండో ఆలయంలో నటరాజస్వామి, మూడో ఆలయంలో శివకామసుందరీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. దుర్గామల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న భక్తులు ఇక్కడ కొంత సేద తీరేవారు. గతంలో ఇక్కడ కళాప్రదర్శనలు ఇచ్చేవారు. ప్రస్తుతం దేవస్థానంలోని రాజగోపుర ప్రాంగణంలో కళావేదిక ఏర్పాటు చేయడంతో కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఈ ఉపాలయం పరిమితమైంది.

నాగేంద్ర స్వామి పుట్ట వద్ద సుబ్రహ్మణ్య స్వామి ఆలయం



నాగేంద్ర స్వామి పుట్ట వద్ద నాగుల చవితికి పాలు పోసేందుకు మహిళా భక్తులు తరలివస్తారు. నిత్యం భక్త జన సంచారం ఉండేందుకు వీలుగా ఇక్కడ శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని నిర్మించారు. తల్లిని దర్శించుకున్న భక్తులు తనయుడైన సుబ్రహ్మణ్యుడి ఆశీస్సులు తీసుకునేందుకు ఇక్కడికి వస్తారు. ప్రతి నెల సుబ్రహ్మణ్య షష్ఠి రోజున స్వామి వారి కల్యాణానికి విశేష ఆదరణ ఉంది.

క్షేత్ర పాలక ఆంజనేయ స్వామికి బంగారు కవచం

ఏ క్షేత్రంలోనైనా తొలుత క్షేత్రపాలకుడి దర్శనం పూర్తి చేసుకున్న తరువాత మాత్రమే క్షేత్ర దేవుడిని దర్శించుకుంటారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనం చేసుకునే భక్తులు కూడా తొలుత క్షేత్రపాలకుడిని దర్శించుకునేవారు. కాలక్రమంలో భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో క్యూలైన్లు వేయడంతో భక్తులు క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామిని దర్శించుకునే అవకాశం లేకుండా పోయింది. ఉచిత దర్శన క్యూలో వచ్చే భక్తులకు మాత్రం ఈ వాయుపుత్రుడి దర్శనం లభిస్తుంది. క్షేత్రపాలకుని విశిష్టతను గుర్తించి దాతలు రూ.కోట్ల విలువ చేసే బంగారు కవచం, కిరీటాన్ని గత ఏడాది అందజేశారు. ఘాట్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నడచి వచ్చే భక్తులు మాత్రమే దర్శించుకుంటున్నారు.

ఘాట్ రోడ్డు ముఖద్వారంలో..

దుర్గమ్మ దర్శనానికి ఘాట్ రోడ్డు మార్గంలో వచ్చే భక్తులు కామధేను అమ్మవారిని దర్శించుకుంటారు. కోరిన వరాలు ఇచ్చే దుర్గమ్మ దర్శనానికి నేరుగా రాలేని వారి కోసం జాతీయ రహదారి పక్కన కామధేను శిల్క్స్ వారు ఇక్కడ వినాయకుడి ఆలయంతోపాటు అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. జాతీయ రహదారిపై వెళ్లే వారు కామధేను అమ్మవారిని దర్శించుకుంటారు. రెండు ఆలయాలకు కలిపి మండపాన్ని నిర్మించి నిత్యం నివేదనార్చనను రుత్వికులు నిర్వహిస్తున్నారు



నేటి అలంకారం 7-10-2024, సోమవారం

శ్రీ మహా చండీ దేవి

శరన్నవరాత్రి మహోత్సవాలలో ఐదోరోజు కనకదుర్గమ్మ శ్రీ మహాచండీ దేవిగా దర్శనమిస్తారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కొరకు మహాలక్ష్మీ, మహాకాళీ, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా శ్రీ మహాచండీ అమ్మవారు ఉద్భవించింది. శ్రీ చండీ అమ్మవారిలో అనేక మంది దేవతలు కొలువై ఉన్నారు. శ్రీ మహాచండీ అనుగ్రహం వలన విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారటం, ఏ కోరికలతో ప్రార్థిస్తామో ఆ కోరికలు అన్నీ సత్వరమే లభిస్తాయని భక్తజనుల నమ్మకం.


దేవానాం కార్యసిద్ధ్యర్థం ఆవిర్భవతి సా యదా! ఉత్పన్నేతి తదా లోకే సానిత్యాప్యభిధీయతే!

దేవాదాయ శాఖలో సమూల మార్పులకు చర్యలు

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దేవాదాయ శాఖలో సమూల మార్పులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. దసరా వేడుకల్లో ఆదివారం లలితాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ సాంప్రదాయల విషయంలో అధికారులు జోక్యం చేసుకోవద్దని సూచించారు. దేవతామూర్తులకు జరిగే కైంకర్యాలు ఆగమ సాంప్రదాయం ప్రకారం నిర్వహించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆగమశాస్త్రానికి విరుద్ధంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. ధూప, దీప నైవేద్యాల కింద రూ.50వేల వార్షిక ఆదాయం కలిగిన ఆలయాలకు రూ.10 వేల మొత్తాన్ని ఇస్తామన్నారు. ట్రస్టుబోర్డుల్లో సైతం బ్రాహ్మణులు, నాయిబ్రాహ్మణులకు చోటు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం అవసరమైతే శాసనసభలో తీర్మానం చేసి చట్ట సవరణ చేస్తామన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఆదాయం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో నాలుగో రోజు ఆదివారం రికార్డు స్థాయిలో రూ.66.33 లక్షల ఆదాయం లభించింది. లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. క్యూలైన్లో బారులు తీరిన వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్న తరువాత ప్రసాదాల కౌంటర్ల వద్దకు చేరడంతో రద్దీ ఏర్పడింది. ఒక దశలో ప్రసాదం అందుతుందో లేదోనన్న ఆందోళన అధికారుల్లో కనిపించింది. లడ్డూల విక్రయం ద్వారా రూ.22.16లక్షలు, రూ.500, రూ.300, రూ. 100 దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.28.82 లక్షలు, రూ.8.82లక్షలు, రూ.5.39 లక్షల ఆదాయం వచ్చింది. 2,892 మంది తలనీలాల సమర్పించారు. తద్వారా దేవస్థానానికి రూ.1.14 లక్షలు ఆదాయం లభించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

ఆరు నిమిషాల్లో అమ్మవారి చరిత

అబ్బుర పరిచిన లేజర్ షో


తపస్సు చేస్తున్న కీలుడు


బ్రహ్మదేవుని వరం పొంది లోకాలను కబళించేందుకు వెళ్తున్న మహిషాసురుడు


మహిషాసురుడిని సంహరించేందుకు వచ్చిన దుర్గామాత


శివుడు మల్లేశ్వరుడిగా.. ఇంద్రకీలాద్రిపై లింగం ఆకారంలో వెలసి..


కనకదుర్గమ్మగా దర్శనమిచ్చిన అమ్మవారు


కృష్ణవేణి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన లేజర్ షో

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ ఆలయ ప్రాశస్త్యాన్ని సుమారు ఆరు నిమిషాల్లో లేజర్ షో ద్వారా ప్రదర్శిస్తున్నారు. విజయవాడ కృష్ణవేణి ఘాట్ వద్ద సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఇంద్రకీలాద్రిపై నిత్యం ఈ లేజర్ షో ప్రదర్శిస్తున్నారు. ఆలయ చరిత్రను తెలిపే సన్నివేశాలతో రంగురంగుల లేజర్ లైట్లతో షో కనువిందు చేస్తోంది. క్యూలైన్లు, కనకదుర్గ ప్లైవంతెన, రోడ్డుపై నుంచి ఈ ప్రదర్శనను భక్తులు తిలకించి పులకించిపోతున్నారు. కీలుడు తపస్సు చేయడం, మహిషాసురుడిని అమ్మవారు సంహరించడం.. శివుడు మల్లేశ్వరుడిగా ఇంద్రకీలాద్రిపై వెలిసిన దృశ్యాలను ప్రదర్శిస్తున్నారు. -ఈనాడు, అమరావతి

ఆర్జిత సేవల భక్తులకు అడ్డంకులు



దాతల లాంజ్ వద్ద భక్తులను ఆపిన పోలీసులు


కుంకుమార్చన పూజకు వెళ్లే మార్గంలో ఇలా..


వీఐపీ పాసులున్న వారిని నిలిపివేసిన పోలీసులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపైకి వ్యయప్రయాసలకోర్చి ఆర్జిత సేవల పూజలకు వచ్చే భక్తులకు పోలీసు అడ్డంకులు తప్పడం లేదు. టిక్కెట్లు తనిఖీ చేసి పంపడం వరకు ఇబ్బంది లేదు. తనిఖీ పేరుతో వారిని అడ్డుకోవడంతో పూజలకు ఆలస్యం అవుతోందని, అడిగితే ముందుగా రావాలంటున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీఐపీల పేరుతో వచ్చే వారితో పాటు తమను కూడా ఎందుకు ఆపుతున్నారని ఉభయదాతలు పోలీసులను ప్రశ్నించినా పట్టించుకోని పరిస్థితి ఆదివారం ఉదయం కనిపించింది. ప్రధానంగా దాతల లాంజ్ వద్ద చేతిలో టిక్కెట్లు ఉన్నా పంపకుండా నిలిపేశారు. ఆగ్రహం వ్యక్తం చేయడంతో అప్పుడు పంపారు. దాతల లాంజ్ నుంచి చిన రాజగోపురం వద్దకు రాగా, అక్కడ కూడా ఇదే పరిస్థితిని వారు ఎదుర్కొన్నారు. అందరినీ ఒకే మార్గంలో పంపడంతో సమస్య తలెత్తుతోంది. అలా కాకుండా ఈవో పేషీ వైపు మార్గంలో కుంకుమ పూజ, ఇతర పూజలకు చెందిన భక్తులను పంపితే ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో పూజలకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. పోలీసు అధికారులు ఆ దిశగా ఆలోచించి చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

కన్వేయర్ బెల్ట్‌తో పారిశుద్ధ్య సమస్యకు తెర


కృష్ణవేణి ఘాట్ వద్ద కన్వేయర్ బెల్ట్


బెల్ట్‌కు చివరి భాగంలో వాహనం ఏర్పాటు

కృష్ణలంక, న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని ఘాట్‌లో పారిశుద్ధ్యాన్ని నిర్వహించేందుకు నగర పాలక సంస్థ కృష్ణవేణి ఘాట్‌లో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం భక్తుల రాక తక్కువగా ఉన్నప్పటికీ వేడుకల చివరి రోజుల్లో అధిక సంఖ్యలో భవానీలు తరలివచ్చే అవకాశం ఉంది. వీరందరూ ఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన కేశఖండన శాలలో మొక్కులు చెల్లించుకుని స్నానాలకు తరలివస్తారు. అనంతరం వారు దీక్షా వస్త్రాలను ఘాట్‌లో ఎక్కడపడితే అక్కడ విడిచిపెడుతుంటారు. దీంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. దీనిని పరిగణనలోకి తీసుకుని గతేడాది నగర పాలక సంస్థ ఈ ఘాట్‌లో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేసింది. ఇక్కడ విడిచిన వస్త్రాలను అక్కడి సిబ్బంది సేకరించి వాటిని కన్వేయర్ బెల్ట్ మీదకు చేరుస్తారు. దీని చివరి భాగంలో ఏర్పాటు చేసిన వాహనంలో వాటిని నింపి తరలిస్తారు. దీనివల్ల అక్కడ పారిశుద్ధ్యం బాగుండడంతో పాటు వస్త్రాలను సేకరించే ప్రయాస కార్మికులకు తగ్గుతుంది. ఇదే విధానంలో భవానీ దీక్షా విరమణల సమయంలో వస్త్రాలను తరలిస్తున్నారు.

ఏమరపాటుతో తప్పదు అనర్థం

కన్వేయర్ బెల్ట్ ఉపయోగం ఉన్నా ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా అనర్థాలు కూడా దాపురించే అవకాశం ఉంది. దీనిని ఘట్ మధ్య భాగంలో ఏర్పాటు చేయడంతో పుణ్యస్నానాలకు విచ్చేసే భక్తులు అటు.. ఇటు రాకపోకలు సాగించే క్రమంలో బెల్ట్ కింద నుంచి దూరి వెళుతున్నారు. బెల్ట్ ఆగి ఉంటే ఇబ్బంది ఉండదు. . కానీ ఒకవేళ అది పనిచేస్తున్నప్పుడు భక్తులు అక్కడ ఉంటే ప్రమాదాలకు ఆస్కారం ఉంది.

జగన్మాత ఆశీస్సులతో ప్రజలకు మంచి పాలన అందాలి


నటి కాదంబరి జెత్వాని

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : జగన్మాత దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలకు మంచి పాలన అందాలని కోరుకున్నట్లు నటి కాదంబరి జెత్వాని అన్నారు. ఇంద్రకీలాద్రిపై లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. పోలీసు రక్షణతో ఆమె దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దసరా ఏర్పాట్లు బాగా చేసిందన్నారు. నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇతర ఆలయాల్లో కూడా ఇదే తరహాలో ఏర్పాట్లు చేస్తే బాగుంటుందన్నారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తన వ్యవహారంలో న్యాయం చేస్తుందన్న నమ్మకం కలిగిందని చెప్పారు.

పక్కాగా.. భక్తుల లెక్క


కమాండ్ కంట్రోల్‌లో సీసీ టీవీ పర్యవేక్షిస్తూ..


దర్శనం చేసుకుని వచ్చే భక్తులను లెక్కిస్తూ..



ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను శరనవరాత్రుల్లో దర్శనానికి తరలి వస్తున్న భక్తులు ఎంతమంది వచ్చారో క్షణాల్లో తెలుసుకునేందుకు పోలీస్ యంత్రాంగం ఒక ప్రత్యేక సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. దుర్గ ఘాట్ పక్కనే ఉన్న కమాండ్ కంట్రోల్ రూం నుంచి యంత్రాంగం భక్తుల సంఖ్యను పర్యవేక్షిస్తోంది. అమ్మవారి దర్శనం చేసుకుని భక్తులు బయటకు వచ్చే మార్గంలో లైవ్ స్ట్రీమింగ్ సీసీ ఫుటేజీ నుంచి ఆల్‌గారిథమ్ పద్ధతి ద్వారా పెద్దలు, పిల్లలు వేరు చేస్తూ.. రెడ్ లైన్ దాటగానే లెక్కిస్తుంది. ఆదివారం ప్రయోగాత్మకంగా ఈ పద్ధతిని పర్యవేక్షించారు. సోమవారం నుంచి ఈ పద్ధతి ద్వారా అమ్మవారి దర్శనానికి ఎంత మంది భక్తులు వచ్చారో ప్రతి గంటకు తెలుసుకునే వీలు ఉంటుందని అధికారులు తెలిపారు. - ఈనాడు, అమరావతి

దుర్గమ్మ సేవలో ప్రముఖులు


మంత్రి సంధ్యారాణికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నంరాజు


దర్శనానికి వస్తున్న చిత్ర నిర్మాత దిల్‌రాజు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, చిత్ర నిర్మాత దిల్‌రాజు, సీపీ రాజశేఖర్‌బాబు వేర్వేరుగా జగన్మాత దుర్గమ్మను దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దసరా ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని వారు తెలిపారు. జనసమూహం నడుమ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని మంత్రి సంధ్యారాణి తెలిపారు. వారికి దేవస్థానం అధికారులు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


ఆశీర్వచన మండపంలో సీపీ రాజశేఖర్‌బాబు దంపతులు


కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణసారిక